RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY నిజం మా నిజన్ 18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:1 SUNDAY, MAY ,3,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :1 ఆదివారం, మే 3, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## సిబ్బంది, ప్రయాణకులతో మర్యాదగా ఉండాలి

### ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం హితవు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కింది స్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో,సానుకూల దృక్పథం తో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన - మిగతా2లో



## ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### ఉద్యోగ సంఘాలతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ పత్రిక ప్రతినిధి

వంద రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6 వేల కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతలు ఉద్యోగులే నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మరోమారు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంఘాల నాయకులతోశనివారం సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు హామీలు ఇచ్చారు. పీఆర్సీ పై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిపోర్టు ఆధారంగా పీఆర్సీ పై నిర్ణయం తీసుకుంటామని రేవంత్ భరోసా ఇచ్చారు. జూన్ 1 లోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యల పై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పని చేశారని ప్రశంసించారు. - మిగతా2లో



## ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన - మిగతా2లో



## లేహ్‌లో బుద్ధుని అవశేషాల ప్రదర్శన

తెలంగాణ పత్రిక ప్రతినిధి

క్రీస్తు పూర్వానికి చెందిన గౌతమ బుద్ధుని పవిత్ర భౌతిక అవశేషాలు... ప్రజల సందర్శనార్థం లద్దాఖ్‌లో కొలువుదీరాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రస్తుత సిద్దార్థనగర్ ప్రాంతంలో నేపాల్ సరిహద్దుకు సమీపంలో 1898 లో లభించిన తథాగత బుద్ధుని అవశేషాలను ఇటీవల లేహ్ ప్రాంతానికి తరలించారు. - మిగతా2లో



## ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఫోన్ ట్యాపం అంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవా చేశారు. గతంలో జరిగిన ఫోన్ ట్యాప్ వ్యవహారం పై సమాధానం చెప్పాలన్నారు. కానీ దానికి సమ్మాదనం చెప్పకుండా బురదజల్లడం సరి కాదన్నారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వం పై ఆరోపణలు చేస్తున్నారని దానం - మిగతా2లో



## సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం - మిగతా2లో



## సిరిసిల్ల వాసుల మృతి పై కెటిఆర్ సంతాపం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి - మిగతా2లో



## బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువే

తెలంగాణ పత్రిక ప్రతినిధి

హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని - మిగతా2లో



## రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణ మాఫీ చారాణ చేసి బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. - మిగతా2లో



## ఉత్తమ్ కెసిఆర్ కోవర్ట్

### ఎంపి అర్వింద్ ఆరోపణలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ - మిగతా2లో



# ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

-మొదటిపేజీ తరువాయి

తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్–అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశం పై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్తి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని, అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు అనిశ్చితిలో పడ్డాయి.'ఒప్పందం కుదరకపోతే ఇతర మార్గాలను కూడా పరిశీలించాల్సి వస్తుంది' అని ట్రంప్ తాజాగా హెచ్చరించారు.

# లేహ్‌లో బుద్ధుని అవశేషాల ప్రదర్శన

-మొదటిపేజీ తరువాయి

క్రీస్తు పూర్వానికి చెందిన గౌతమ బుద్ధుని పవిత్ర భౌతిక అవశేషాలు... ప్రజల సందర్శనార్థం లద్దాఖ్‌లో కొలువుదీరాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రస్తుత సిద్ధార్థనగర్ ప్రాంతంలో నేపాల్ సరిహద్దుకు సమీపంలో 1898లో లభించిన తథాగత బుద్ధుని అవశేషాలను ఇటీవల లేహ్ ప్రాంతానికి తరలించారు. ఈ బుద్ధ అవశేషాలను విలియమ్ క్లాక్స్టన్ పెప్పె అనే బ్రిటిష్ జమిందారు ఒక పురాతన స్తూపంలో కనుగొన్నాడు. అవశేషాల్లో అస్థికలతోపాటు 1500 విలువైన రాళ్లు, బంగారు ఆభరణాలు కూడా ఉన్నాయి. వీటిని గత సంవత్సరం భారత్‌కు అందజేశారు. తాజాగా లేహ్ ప్రాంతంలోని జీవేత్సల్‌లో 2569వ బుద్ధ పూర్ణిమ సంబరాల సందర్భంగా ఈ అవశేషాల ప్రదర్శనను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ప్రారంభించారు.

# ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా

-మొదటిపేజీ తరువాయి

ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొచ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదా అని చెప్పారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలని ఈ ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. శనివారం హైదరాబాద్‌లో దానం నాగేందర్ మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజా నాయకుడు.. ఆయన ప్రజల్లో ఉంటారని.. సందర్భాన్ని బట్టి బయటకు వస్తారని చెప్పుకొచ్చారు. కవిత కలలు కనాలి కానీ కబుర్లు చెప్పొద్దని ఎద్దేవా చేశారు. సొంత తండ్రిని విమర్శించడం ఆమెకు తగదని హితవు పలికారు. తల్లిదండ్రులను గౌరవించలేని వాళ్లు ఏం మనుషులని ప్రశ్నించారు. కవిత తన ఇంటి సమస్యను బయటకు తీసుకువస్తోందని అన్నారు. ఆమె రాజకీయంగా మాట్లాడాలి కానీ సొంత తండ్రిని విమర్శించడం ఏంటి? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను కవిత డీ మోరల్ చేస్తూ.. పెద్దాయనను ఇబ్బంది పెట్టడం తగదని దానం నాగేందర్ పేర్కొన్నారు.

# ఉత్తమ్ కెసిఆర్ కోవర్ట్

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు. శనివారం ఎంపీ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేసిందేమీ లేదని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్‌కు శ్రద్ధ అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఎంపీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సివిల్ సప్లై శాఖలోనే అత్యంత అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్టలనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగు తోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

-మొదటిపేజీ తరువాయి

రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేపడానికి ఎక్కడికో వెళ్తుండేవారని.. కానీ కొండపోచమ్మ , మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నీరు, గ్రాసం కోసం వేరేవాళ్లు ఇప్పుడు మన దగ్గరకు వస్తున్నారని చెప్పుకొచ్చారు. జీవాలకు నట్టల మందు కూడా ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావట్లేదని సెటైర్లు గుప్పించారు. బీఆర్‌ఎస్ హయాంలో భూముల ధరలకు రెక్కలు రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములను కొనేవారు, చూసేవారు లేరని హరీశ్‌రావు విమర్శించారు.

# ఉద్యోగుల సంక్షేమానిక కట్టుబడి ఉన్నాం

-మొదటిపేజీ తరువాయి

వంద రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6వేల కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతలు ఉద్యోగులే నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మరోమారు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంఘాల నాయకులతోశనివారం సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు హామీలు ఇచ్చారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిపోర్టు ఆధారంగా పీఆర్సీ పై నిర్ణయం తీసుకుంటామని రేవంత్ భరోసా ఇచ్చారు. జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యల పై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పని చేశారని ప్రశంసించారు. వారి సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తారీకునే జీతాలు అందేలా చర్యలు చేపట్టినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం చేసినట్లు చెప్పుకొచ్చారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలనూ ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతా కార్డుల ప్రతిపాదనపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. 'ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం.. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది' అంటూ సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.

# సిబ్బంది, ప్రయాణకులతో మర్యాదగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

కిందిస్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది.. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్లు సమీక్షించుకోవాలన్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. 'ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూమ్ సమావేశంలోఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీఎంలు పాల్గొన్నారు.

# సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

-మొదటిపేజీ తరువాయి

పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు. ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బుల్లేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హామీ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు.

# సిరిసిల్ల వాసుల మృతి పై కెటిఆర్ సంతాపం

-మొదటిపేజీ తరువాయి

అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్‌సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనానికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్ఆర్‌పై 16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుంచి మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాతపడ్డారు. కోడం తేజశ్రీ(శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. అనంతరం కిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కొడుకు, కోడలు, అల్లుడి కుటుంబాలు మృత్యువాతపడటంతో తీవ్ర విషాదం నెలకొన్నది. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ యోగేశ్‌గౌతం ఘటనాస్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అలసిపోయి రెప్పవాల్చడంతో వేగంగా వెళ్లి కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటుందని డీసీపీ వెల్లడించారు. దర్యాప్తులో ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. సూర్యాపేట నుంచి నూకల లోడ్‌తో నంద్యాలకు వెళ్తుండగా లారీపై ఉన్న తాడిపత్రి సరిగాలేకపోవడంతో, సరిచేసేందుకు పక్కకు ఆపుకొన్నట్టు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. తాను డ్రైవింగ్ సీట్‌లోనే ఉన్నానని, క్లీనర్ లారీపైకి ఎక్కి తాడిపత్రి సరిచేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు.. లారీని ఢీకొట్టిందని వెల్లడించారు.

# బతుకమ్మ కుంట ముమ్మాటికీ చెరువే

-మొదటిపేజీ తరువాయి

ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటున్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహానీలలో 563/–1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా డ్రైవ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందని రంగనాథ్ తెలిపారు. హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ విషయంలో హైకోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ డిమార్కింగ్ చేయాలని రంగనాథ్ చెప్పుకొచ్చారు.

# ఓఆర్ఆర్ పై ప్రమాదం.. డ్రైవర్ చేసిన ఆ చిన్న పొరపాటే.. ఒక కుటుంబాన్ని బలితీసుకుంది






-రోజంతా ప్రయాణం, ఎండ వేడితో డ్రైవింగ్? చేస్తున్న వ్యక్తి
-నిద్ర పోవడమే యాక్సిడెంట్‌కు కారణం!
-అందరూ సిరిసిల్ల వాసులు.. ఒకే కుటుంబానికి చెందినవారు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 02,తెలంగాణ పత్రిక

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై ఘోర ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టగా.. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. యాదగిరిగుట్ట లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, స్వర్ణగిరి క్షేత్రాలను దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. మృతుల్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. కారులో మొత్తం ఏడుగురు ఉండగా, ఓ మహిళ తీవ్ర గాయాలతో బయటపడ్డారు. సనత్‌నగర్‌లో నివాసముంటున్న బొల్లి శివకుమార్ (37) తన కారులో భార్య లావణ్య (లాస్య)(33), కూతురు బొల్లి రిషిత(7), బావ కొడెం శ్రీనివాసులు(39), సోదరి కొడెం శ్వేత, వారి పిల్లలు కొడెం కృష్ణ చైతన్య చంద్ర(11), కొడెం మాధవ్(9)తో కలిసి యాదగిరిగుట్టకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. మధ్యాహ్నం సుమారు 3:30 నుంచి 4 గంటల మధ్య రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం తొండుపల్లి ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16 దగ్గరకు రాగానే, డ్రైవింగ్ చేస్తున్న శివకుమార్‌కు ఒక్కసారిగా కన్నంటుకుంది. దీంతో ఎడమ వైపున ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. వేగానికి కారు లారీ కిందికి దూసుకెళ్లి పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో బొల్లి శివకుమార్, బొల్లి లాస్య, బొల్లి రిషిత, కొడెం శ్రీనివాసులు, కొడెం కృష్ణ చైతన్య చంద్ర, కొడెం మాధవ్ అక్కడికక్కడే మృతి చెందారు. కొడెం శ్వేత తీవ్ర గాయాలతో దవాఖానలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వాహనం పూర్తిగా నుజ్జునుజ్జవ్వడంతో మృతదేహాలను బయటకు తీయడం కష్టతరంగా మారింది. చివరకు అతికష్టం మీద డెడ్‌బాడీలను బయటికి తీసి ఉస్మానియా దవాఖానకు తరలించారు.ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ అక్కడ నుంచి పరారైనట్టు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రోజంతా ప్రయాణం చేయడం, ఎండ వేడి వల్ల డ్రైవర్ అలసటతో నిద్రపోవడమే యాక్సిడెంట్‌కు ప్రధాన కారణమని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఓవర్ స్పీడ్‌లో ఉండడం కూడా ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. మృతులంతా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒకే కుటుంబ సభ్యులని, కొన్నేండ్ల కింద హైదరాబాద్‌లోని సనత్ నగర్‌కు వచ్చి స్థిరపడ్డారని పోలీసులు చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచే యాదగిరిగుట్టకు వెళ్లారని తెలిపారు. సంఘటనా స్థలాన్ని చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. లారీ ఆపి టార్పాలిన్ కప్పుతుండగా..టార్పాలిన్ జారిపోవడంతో సరుకు పడిపోతుందని ఓఆర్ఆర్ లోని ఎమర్జెన్సీ వే లో లారీని డ్రైవర్ ఆపాడు. దీంతో ఓవర్ స్పీడ్‌లో ఉన్న శివకుమార్ నిద్రలోకి జారుకోవడంతో గమనించలేదు. వేగంగా వెళ్లి ఢీకొట్టడంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాగా, ఘటనపై ఫ్యూచర్ సిటీ అడ్మిన్ జాయింట్ సీపీ చందనా దీప్తి స్పందించారు. ప్రమాద ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయానికి ముందు టోల్‌గేట్ వద్ద, ఓఆర్ఆర్ పై ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. కాగా, సిరిసిల్ల బీఆర్ఎస్ లీడర్ బొల్లి రామ్మోహన్‌కు శివకుమార్ సోదరుడు కావడం.. ఆ కుటుంబమంతా మరణించడంతో కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత 'శీతల మజ్జిగ పంపిణీ







-దాహ నివారణ సేవ.......

పరకాల/గీసుకొండ/ మే 02 తెలంగాణ పత్రిక

ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న ఈ సమయంలో, రైతులు, పశువుల వ్యాపారులు ప్రయాణికులకు చల్లని ఉపశమనం కల్పించే ఉద్దేశ్యంతో అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత 'శీతల మజ్జిగ పంపిణీ' -- 'దాహ నివారణ సేవ' కార్యక్రమం కొమ్మాల అంగడి ప్రాంగణంలో ఘనంగా జరిగింది. మన ప్రియతమ నాయకులు అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి ఆలోచనతో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం ప్రజల నుండి విశేష స్పందనను పొందింది. వరంగల్ జిల్లా లోనే కొమ్మల సంత అతి పెద్దది. దాదాపు 3,000 మందికి పైగా రైతులు, పశువుల వ్యాపారులు ప్రయాణికులకు ఉచితంగా శీతల మజ్జిగ పంపిణీ చేసి, ఎండ వేడి నుండి ఉపశమనం కల్పించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా నాయకులు, గీసుకొండ సర్పంచ్ వీరగోని రాజ్ కుమార్ , జిల్లా నాయకులు అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా స్వయంగా మజ్జిగ పంపిణీ చేయడం విశేషంగా నిలిచింది.ప్రజలతో కలిసిమెలిసి సేవ చేయాలనే వారి తపన ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైంది.ఈ సందర్భంగా కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమునా ప్రవీణ్, దస్రుతండ సర్పంచ్ కేలోతు అమృత బిక్షపతి, సూర్య తండా సర్పంచ్ బాణోతు రాఘవేంద్ర, మాజీ ఎంపీటీసీ బానోతు శ్రీనివాస్, నాయకులు మాదాసి రాంబాబు, మాజీ సర్పంచ్ మొగసాని నాగదేవత సంపత్,తుప్పరి వికాస్, గాడిదుల బొంద్యాలు, బోయ అశోక్, తుప్పరి క్రాంతి, సాయిలీ మధు, బోగి శ్రీను, దౌడు రాజేష్, ధరంసోత్ వీరన్న, వాంకుడోత్ తిరుపతి, గూగులోతు రాజు, హర్జ్య తండా హరి నాయక్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ప్రతి శనివారం ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజ సేవ పట్ల అంకితభావంతో, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలిచిందని స్థానికులు అభినందించారు.

# యూరియా వాడకం తగ్గించండి -నేల ఆరోగ్యాన్ని కాపాడండి

-డాక్టర్ సిహెచ్ రాములు డాక్టర్ జి పద్మజ

నర్సంపేట మే 02 తెలంగాణ పత్రిక





నర్సంపేట మండలం మాదన్న పేట గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది, ఇందులో రైతులకు రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్ రాములు మాట్లాడుతూ ప్రధానంగా తక్కువ యూరియా వాడకం మీద అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వాడకం అంటే ఉదాహరణకు వరి పంటలో కేవలం 100 కిలోలు యూరియా 50 కిలోల డిఏపి 25 కిలోల పోటాష్ వాడుకోవాలని సూచించారు తద్వారా సాగు ఖర్చును తగ్గించుకొని నేల, నీరు, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు అని సూచించారు.

-ఈ సందర్భంగా డాక్టర్ జి పద్మజ మాట్లాడుతూ

అవసరం మేరకు రసాయనాలను వాడుకోవాలి అంటే ఎరువులు, గడ్డి మందులు, పురుగుమందులు, తెగులు మందులు, సిఫారసు మేరకు మాత్రమే వాడాలని తద్వారా నేల నీరు వాతావరణ కాలుష్యమును తగ్గించుకోవచ్చు అని సూచించారు. రైతులు ఎరువులు, విత్తనాలు పురుగుమందులు తెగులు మందులు కొనుగోలు చేసినప్పుడు తప్పక కొనుగోలు రసీదును తీసుకోవాలని తద్వారా పంటలకు ఏ సమయంలో అయినా నష్టం వాటిలినప్పుడు నష్టపరిహారాన్ని ఆ కంపెనీ నుంచి పొందడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది అని సూచించారు.

-మండల వ్యవసాయ అధికారి కృష్ణ కుమార్ మాట్లాడుతూ

సాగునీటిని ఆదా చేయడం ద్వారా నీటి నిలువలను కాపాడాలని తద్వారా రాబోయే తరాలకు మంచి నీటి వనరులను మంచి చెరువులను మంచి నీటి సదుపాయాన్ని అవసరాలు నెరవేరే విధంగా ఉండాలని తెలియజేశారు. అదేవిధంగా పంట మార్పిడి అవసరం గురించి తెలియజేశారు ఈ వివిధ పంటలలో అధిక దిగుబడి సాధించడానికి పంట మార్పిడి ఏ రకంగా సహాయపడుతుంది అదేవిధంగా నేలసారం వృద్ధి అవుతుంది అని వివిధ పంటలలో ఉదాహరణగా సూచించారు వరికి ముందు పచ్చి రొట్ట పంటలు వేసుకోవడం వరి తర్వాత పెసర్లు, బబ్బిర్లు,మినుములు గాని వేసుకోవడం ద్వారా పప్పు దినుసులు అవసరాలు నెరవేరుతుంది. ఈ పంటలను నేలలో కలియ దున్నడం ద్వారా నేలా ఆరోగ్యం మెరుగవుతుంది తద్వారా సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చు అని తెలియజేశారు. అదేవిధంగా చెట్లను పెంచడం వలన వాతావరణ, నేల నీటి కాలుష్యాన్ని తగ్గించుకొని సుస్థిర ఆదాయాన్ని పొందడమే కాకుండా మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది అని సూచించారు..... ఈ కార్యక్రమంలో, శాస్త్రవేత్తలు డాక్టర్. సి.హెచ్. రాములు. డాక్టర్. జి. పద్మజ, మండల వ్యవసాయ విస్తరణాధికారి శ్రీ కృష్ణ కుమార్ , వ్యవసాయ విస్తరణ అధికారి త్రివేణి , వ్యవసాయ విద్యార్థులు శ్రీజ , పూజ రైతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ విధమైనటువంటి కార్యక్రమాలను ముందు ముందు కూడా జరపాలని అదేవిధంగా ఇట్లాంటి కార్యక్రమాలను మునుముందు చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు అదేవిధంగా సేంద్రియ వ్యవసాయం గురించి కూడా రైతులు ఆసక్తిగా వారి వారి సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగింది.

# కొత్తగూడెంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

-హిమాశ్రీ చురుకైన పాత్ర



కొత్తగూడెం, ఆర్‌సి మే 2(తెలంగాణ పత్రిక)

కొత్తగూడెం నియోజకవర్గంలో కళ్యాణ లక్ష్మి పథకం కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొని, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా 18వ డివిజన్‌లోని లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో కార్పొరేటర్ కంచర్ల హిమాశ్రీ ప్రత్యేకంగా నిలిచారు. మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమ్మలయ్య కుమార్తెగా రాజకీయ పరిజ్ఞానం, సేవాభావం కలిగిన హిమాశ్రీ, తన డివిజన్‌లో అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం అందేలా కృషి చేశారు. లబ్ధిదారుల వివరాలను సేకరించడం నుంచి చెక్కుల పంపిణీ వరకు ప్రతి దశలో హిమాశ్రీ చురుకైన పర్యవేక్షణ వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అనేక పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగించడంతో పాటు, వారి ఇళ్లలో ఆనందం నింపినట్లైంది. స్థానిక ప్రజలు హిమాశ్రీ సేవలను ప్రశంసిస్తూ, ఆమె భవిష్యత్తులో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

# నీట్ పరీక్ష సందర్భంగా కాల్ సెంటర్స్

-కలెక్టర్ అంకిత్.




భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 2

ఆదివారంనిర్వహించబడుతున్న నీట్ పరీక్ష సందర్భంగా అభ్యర్థులు తల్లిదండ్రులకు సహాయార్థం జిల్లా కాల్ సెంటర్ నంబర్ 9392919743 ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.మన జిల్లాలో మొత్తం 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడగా, అన్ని కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.ఈ కాల్ సెంటర్ ఆది వారం ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. పరీక్షకు సంబంధించిన ఏవైనా సహాయం లేదా సమాచారం అవసరమైతే పై నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# అగ్నిప్రమాదం: ఆరు ఎకరాల వరి పడుగు దగ్ధం

మంగపేట, మే 02 (తెలంగాణ పత్రిక):





మంగపేట మండలం కమలాపురం గ్రామ శివారులో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక రైతుకు భారీ నష్టం వాటిల్లింది. కావలకుంట పరిధిలోని వరి పొలంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పంట పడుగు కాలి బూడిదైంది.యాసంగి వరి కోతలు పూర్తయ్యాక పొలంలో ఉన్న వరి పడుగుకు ఒక్కసారిగా ఎరగడి (మంటలు) అంటుకుంది. మంటలు వేగంగా వ్యాపిస్తుండటాన్ని గమనించిన స్థానిక రైతులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దురదృష్టవశాత్తు ఫైర్ ఇంజన్ వచ్చేలోపే మంటలు ఉధృతమై, రైతు యాసం హరీష్ కు చెందిన ఆరు ఎకరాల పొలంలోని పడుగు పూర్తిగా దగ్ధమైంది.ఈ ప్రమాదం వల్ల సుమారు రూ. 60,000 వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు హరీష్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అగ్నిప్రమాదంతో నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

# వరి ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నిరసన

ముధోల్:02ఏప్రిల్(తెలంగాణ పత్రిక)



మండలంలోని చింతకుంట తండాలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కల్లాల వద్ద శనివారం రైతులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వరి ధాన్యం కోసి నెలరోజులు అవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని జల్లెడ పట్టుకొని తీసుకొస్తేనే వడ్లను కొనుగోలు చేయడం జరుగుతుందని అధికారులు చెప్పున్నారన్నారు. ఎలాంటి షరతులు లేకుండా వరి ధాన్యం తీసుకోవాలని వేడుకుంటున్నారు. కల్లాల వద్ద అధిక మొత్తంలో వరిధాన్యం ఉందని వర్షం వస్తే తడిసి నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని అంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్



ఇల్లంతకుంట మే 2 తెలంగాణ పత్రిక

విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డి సూచించారు. ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నెల రోజుల పాటు నిర్వహించే వాలీబాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రధానోపాధ్యాయురాలు మేకల పావని, సర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బట్టు పద్మ శ్రీనివాస్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు శిక్షణ శిబిరాలు వరంలాంటివని, వీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడా నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల చెడు అలవాట్లు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండటంతో పాటు వ్యసనాల బారిన పడకుండా ఉన్నత స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, సీనియర్ క్రీడాకారుల సహకారంతో జూన్ 7 వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాగుల శ్రీకాంత్‌గౌడ్, వార్డు సభ్యులు, ఈ తరం యువజన సంఘం స్పోర్ట్స్ ఇన్‌చార్జి కేశవేణి శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాపన్నపేట, ప్రతినిధి మే 02:(తెలంగాణ పత్రిక)



రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... అబ్లాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి బాల్ రాజు(30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని నిమిత్తం తన బైక్ పై మెదక్ వెళ్లి రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా అన్నారం గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్ ను ఢీ కొట్టింది. దీంతో బైక్ పై ఉన్న బాల్ రాజుకు కిందపడగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# మచ్చాపూర్‌లో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమం





-పంటమార్పిడి పాటించండి - సుస్థిర ఆదాయం పొందండి

-ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి. వెంకన్న

పరకాల/గీసుకొండ/ మే 02 తెలంగాణ పత్రిక

గీసుకొండ మండలం మచ్చాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ బోడకుంట్ల మానస ప్రకాష్ అధ్యక్షతన శనివారం గ్రామ పంచాయితీ ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు(ఆర్.ఎం.ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డా. వి. వెంకన్న మాట్లాడుతూ యూరియా మోతాదుకు మించి వేస్తే పంటలు చీడపీడల బారినపడి సాగుఖర్చు పెరుగుతుంది కాబట్టి రైతులు సుస్థిర దీర్ఘకాలిక వ్యవసాయం చేయటానికి సూచించిన మేరకు మాత్రమే యూరియా వాడి, సాగుఖర్చు తగ్గించుకొని, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఒకేపంటను సంవత్సరాలతరబడి ఒకే ప్రాంతంలో సాగుచేస్తే తెగుళు ,, పురుగుల ఉధృతి పెరుగుతుంది కాబట్టి భూభౌతికస్థితి బాగు పరచడానికి రైతులు పంటమార్పిడి తప్పనిసరిగా చేసి నాణ్యమైన అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏ ఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ జె. భార్గవి మాట్లాడుతూ రైతులు మంచి ధర ఉన్న వంగడాలు వేసుకోని లాభసాటి వ్యవసాయం చెయ్యాలని, అవసరానికి తగ్గట్టుగా పంటకు నీరు పెట్టి భావితరాలకోసం జలవనరులను కాపాడాలని, సేంద్రియ పద్ధతులు పాటిస్తూ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ద్వారా అధిక ఆదాయం సాధించాలన్నారు. అధిక యూరియా రసాయనిక ఎరువులు, పురుగుమందులు విచక్షణారహితంగా వాడటం వల్ల హానికారక మూలకాలు ఆహారచక్రం లోకిప్రవేశించి క్యాన్సర్ వ్యాధికి కారణమౌతున్నాయని ఎన్ ఎఫ్ ఎస్ ఎం కన్సల్టెంట్ . సారంగం తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్టనిచ్చే జీలుగ, పెసర వంటి పంటలను వానాకాలం పంటలసాగుకు ముందు పొలాల్లో విరివిగా చల్లుకొని భూమిలో కలియదున్ని భూసారం పెంచుకోవాలన్నారు. నిషేధిత హెచ్. టి. బి. టి. పత్తివిత్తనాలు అమ్మినా, కొన్నా, కలిగివున్నా, సాగుచేసినా క్రిమినల్ కేసులు నమోదు ఔతాయన్నారు. పారాక్వాట్ కలుపు మందు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినందున ఎవ్వరూ వాడొద్దన్నారు. సర్పంచ్ బోడకుంట్ల మానస మాట్లాడుతూ ఇలాంటి రైతు అవగాహన కార్యక్రమాల వల్ల రైతులకు కొత్తవిషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని, సాధ్యమైనన్ని ఎక్కువ సమావేశాలు గ్రామాల్లో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్మిత, వార్డు సభ్యులు, ఇన్పుట్ డీలర్స్, అభ్యుదయ రైతులు, రైతులు, వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు బి. శ్రీకాంత్, జి. ప్రవీణ పాల్గొన్నారు.

# సీపీఎం నాయకురాలు శకుంతల మృతిపాడే మోసిన జిల్లా కార్యదర్శి రమేష్ బాబు





-ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించిన పార్టీ నేతలు

పోతంగల్ తెలంగాణ పత్రిక మే 2.

పోతంగల్ మండల కేంద్రానికి చెందిన సీపీఎం గ్రామ పార్టీ మహిళా నాయకురాలు కామ్రేడ్ నేనావత్ శకుంతల శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆమె స్వగ్రామం పోతంగల్ లో అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పార్టీ నేతలు శకుంతల పార్థివ దేహంపై ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. రమేష్ బాబుతో పాటు పార్టీ నేతలు పాడే మోశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ..... మంజీరా నది పరివాహక ప్రాంతంలో ప్రభుత్వ భూములను పేద ప్రజలకు పంపిణీ చేయాలని పాలకులపై పోరాటం చేసి, సాగు భూములు సాధించిందన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో నిరుపేదలకు ఇండ్ల స్థలాల కోసం నిరుపేదలను ఏకం చేసి, పోరు నడిపి సుమారు 120 మందికి ఇండ్ల స్థలాలు ఇప్పించిన పోరాట వనిత అని కొనియాడారు. వ్యవసాయ కూలీలకు కూలీ రేట్లు పెంచాలని వారం రోజులపాటు సమ్మె చేసి భూస్వాములు కూలీ రేట్లు పెంచే విధంగా ఎర్రజెండా చేతబట్టి ముందుకు సాగిందన్నారు. పోరాటానికి మారుపేరు కామ్రేడ్ శకుంతల అని ఆమె ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని అయన పిలుపునిచ్చారు. అంత్యక్రియల్లో సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, జిల్లా కమిటీ సభ్యులు యేశాల గంగాధర్, సీనియర్ నాయకులు గంగాధరప్పా, శంషుద్దీన్ నాయకులు బొర్ర సత్యనారాయణ, నాగనాథ్, సాయ గౌడ్, రాములు, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది










-మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 2

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ముందుగా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత చింతగుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని, మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల, రహదారి, క్రీడా వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, రవాణా, క్రీడా రంగాల్లో పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నిజంగా పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ద్వారా జిల్లాలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ పాఠశాలలో సుమారు 2,000 నుండి 2,500 మంది విద్యార్థులు ఒకేచోట విద్యనభ్యసించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా కొనసాగుతోందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఎస్పి రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం





**-లబ్ధిదారులతో కలిసి నూతన గృహాన్ని ప్రారంభించిన షబ్బీర్ అలీ**

భిక్కనూరు మే 02 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)

మండల కేంద్రంలో కుమ్మరిగల్లిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ లబ్ధిదారుల నూతన గృహప్రవేశాన్ని, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ హాజరై, గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ తో ,లబ్ధిదారులు గొల్లరమేష్ తో కలిసి నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు,అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు, ఈసందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహనిర్మాణం పథకం పేదల,మధ్యతరగతి కుటుంబాల చిరకాల స్వప్నం సొంతింటి కల సహకారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు, లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్నటువంటి ఈఇందిరమ్మ పథకం ద్వారా మాకోరిక అయినటువంటి సొంతింటి గృహనిర్మాణం కల నెరవేరిందని ఆనందాన్ని వ్యక్తపరిచారు,ఈ క్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి,టి.పి.సి.సి ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిరుపరి భీమ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు,పార్టీ గ్రామ అధ్యక్షులు అందే దయాకర్ రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ తాటిపాముల లింబాద్రి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి లింగాల రాజబాబు గౌడ్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్, పార్టీ నాయకులు తాటిపాముల విజయ్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లోనే శాస్త్రవేత్తలు అన్నదాతలకు అవగాహన కార్యక్రమం






గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 2

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం, మల్లారెడ్డిపేట రైతు వేదిక పరిధిలోనీ రామానుజపురం రైతులకు 02.05.2026 న "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు -- అన్నదాతల అవగాహన కార్యక్రమం" విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమం అన్నదాతల అభివృద్ధి కార్యక్రమం (ఏప్రిల్ 27 -- మే 23, 2026)లో భాగంగా జరిగింది ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ సతీష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధా రాణి, టీచింగ్ అసోసియేట్ రైతులకు పంటల సమగ్ర నిర్వహణ, తక్కువ యూరియా వినియోగం, నేల ఆరోగ్యం పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రైతులు ఖర్చులు తగ్గించుకునిఅధిక దిగుబడులు సాధించే విధానాలను సవివరంగా వివరించారు మండల వ్యవసాయ అధికారి సలావుద్దీన్ వరి పంటలో అందుబాటులో ఉన్న వివిధ రకాల వంగడాలు (వెరైటీస్ ) ప్రభుత్వ సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఆయిల్ పామ్ క్లస్టర్ ఇంచార్జ్ డి హరీష్ ఆయిల్ పామ్ సాగు పద్ధతులు, నిర్వహణ దీని ద్వారా రైతులకు లభించే దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలపై వివరించార.రైతులు ఆయిల్ పామ్ సాగును విస్తరించి తమ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) బి. ప్రవీణ్ వివిధ ప్రభుత్వ పథకాల అమలు విధానం, సబ్సిడీల వివరాలు రైతులు పొందే ప్రయోజనాలపై సమగ్రంగా వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిహెచ్ మహేష్ ఉప సర్పంచ్ ఎం బాబు పాల్గొని, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబిం చేందుకు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని కోరారు ఈ కార్యక్రమానికి సుమారు 55 మంది రైతులు హాజరై కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రైతులు కార్యక్రమంపై సానుకూలంగా స్పందించి, వ్యవసాయ అభివృద్ధి కి ఇది ఎంతో ఉపయోగకర మని అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమం లో విద్యార్థులు జాన్ విశాల్ రాజు ఎం.డి. రిజ్వాన్ ఇబ్రహీం పాల్గొన్నారు రైతుల్లో అవగాహన పెంచడంలో శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో ముఖ్య పాత్ర పోషించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# బి.ఆర్.ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

భిక్కనూరు మే 02 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)





మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాయిని గారి శ్రీను బి.ఆర్.ఎస్ పార్టీకి రాజీనామా చేసివారి అనుచరులతో పాటు, పట్టణ కేంద్రానికి చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘానికి చెందిన సుమారు 54 మందితో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు, ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి పలు సంక్షేమ పథకాల అమలుకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఈసందర్భంగా తెలిపారు, ఈక్రమంలో గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్, టీ.పీ.సీ.సీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి,పార్టీ మండల అధ్యక్షులు తిరుపరి భీమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అందే దయాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ గాల్ రెడ్డి,అలయ కమిటీ చైర్మన్ లింబాద్రి,పార్టీ సీనియర్ నాయకులు మద్దూరి రవి, తాటిపాముల విజయ్ కుమార్ గౌడ్,లింగాల రాజబాబు గౌడ్, శ్రీరామ్ వెంకటేష్, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# దక్షిణ కాశీలో ప్రత్యేక పూజలు తైలాభిషేకం

భిక్కనూరు మే 02 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)





మండల కేంద్రంలో గల దక్షిణ కాశీగా పిలువబడే శ్రీసిద్ధరామేశ్వర స్వామి స్వయంభులింగ మహాక్షేత్రం లో,శనివారం ఉదయం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దేవాలయం వద్ద మూలభావి స్నానాలు ఆచరించి, స్వామివారికి మొక్కులు చెల్లించుకుని అలయ ప్రధాన అర్చకులు శ్రీకొడకండ్ల రామగిరి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు, అనంతరం మండపం ఆవరణలో శనివారం సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ న్యాలకంటి రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో శ్రీ శనీశ్వర స్వామికి విశేషంగా తేలాభిషేకం చేయడం జరిగింది,ఆలయ అర్చకులు శ్రీకొడకండ్ల సిద్ధగిరి శర్మ ఆధ్వర్యంలో భక్తులు,శ్రీమాతా భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆనందం వ్యక్తపరిచారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పీ శ్రీధర్,ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే సూచన

జుక్కల్ ఆర్సి / తెలంగాణ పత్రిక మే 2





తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి కార్యక్రమాల నేపథ్యంలో పిట్లం మండలం రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో జుక్కల్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పలు పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, ఆహార భద్రత పథకాలు, విద్యుత్ సబ్సిడీలు వంటి పథకాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జుక్కల్ నియోజకవర్గంలో సుమారు 35 వేల మందికి కొత్త రేషన్ కార్డులు అందించామని, అలాగే సీఎంఆర్ఎఫ్ మరియు ఎల్ఓసి ద్వారా దాదాపు 35 కోట్ల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ప్రజలు ఈ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా పిట్లం మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బిచ్కుంద మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ఏఎంసీ చైర్మన్‌లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నియంత్రణ మనందరి బాధ్యత: ఎస్సై అశోక్



ఇల్లంతకుంట మే 2 తెలంగాణ పత్రిక

ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన 2కె రన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణ మనందరి బాధ్యత అని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, పల్లెలు, పట్టణాల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని కోరారు. ఈ ఉద్దేశంతోనే అవగాహన 2కె రన్ నిర్వహించామని వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మామిడి రాజు, పాలకవర్గ సభ్యులు, పోలీసు సిబ్బంది, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యమ కార్యాచరణ నాలుగవ ప్లీనరీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ




మిర్యాలగూడ ప్రతినిధి//మే 2:(తెలంగాణ పత్రిక):-

మారాల్సింది కేవలం పాలకులు మాత్రమే కాదు రాజకీయ విధానాలు మరియు పాలనా పద్ధతులు రాజకీయాలు ఖరీదైన వ్యాపారం అనే భావనను తెరిపి వేసి సామాన్యులకు రాజకీయాల్లో స్థానం కల్పించాలని లక్ష్యంతో తెలంగాణ జన సమితినీ ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో 29 ఏప్రిల్ 2018లో స్థాపించబడినది అని నల్గొండ జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్ రెడ్డి అన్నారు. టీజేఎస్ నాలుగవ ప్లీనరీ సమావేశ విజయవంతం చేయుటకు రూపొందించిన వాల్ పోస్టర్లను మిర్యాలగూడ కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించరు. అనంతరం వారు మాట్లాడినారు గత ప్రభుత్వ కేసీఆర్ నిరంకుశ పాలనను ఓడించడం అత్యవసరమని భావించి ఆ లక్ష్యసాధన కోసం రాజకీయ నిర్ణయాలు తీసుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్కు మద్దతు తెలిపాము కానీ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం లేదు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకు ప్లీనరీ సమావేశంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించుకొని నిరంతరము పోరాటం కొనసాగిస్తామని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ మే 12న హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లోని జలవిహార్ లో నిర్వహించనున్న తెలంగాణ జన సమితి నాలుగోవ రాష్ట్ర ప్లీనరీ విజయవంతం చేయాలని నల్గొండ ప్రజలను కోరినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ క్రాంతి కుమార్ , లచ్చి రామ్ నాయక్, మంద శ్రీను, ప్రకాష్ నాయుడు, మురళి యాదవ్, నరేందర్, జయరాజు, తదితరులు పాల్గొన్నారు. గుండెబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వీణవంకలో రథంపై దర్శనమిచ్చిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి

-స్వామివారిని దర్శించుకున్న గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్..
-అలరించిన శకటోత్సవం...
-మహా అన్నదానానికి పోటెత్తిన శ్రీవారి భక్తులు..

వీణవంక ప్రతినిధి, మే 2 ( తెలంగాణ పత్రిక).




వీణవంక మండల కేంద్రంలో గత వారం రోజులు నడుస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శు క్రవారం సాయంత్రం శకటోత్సవం కనుల పండుగగా సాగింది. ఉత్సవంలో భాగంగా భక్తులు తమ వాహనాలను అలంకరించుకొని, ఎడ్ల బండ్లు, సైకిళ్లు, కార్లు, బైకులు, ఆటోలు, ట్రాక్టర్లు, ట్రాలీలు వాహన దోషాన్ని తొలగించుకునేందుకు గోవిందా అంటూ, గుడి చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేస్తూ, సంతోష సంబరాలతో తమ వాహనాలను గుడి చుట్టు తిప్పారు. శనివారం తెల్లవారుజామున రథోత్సవం ఘనంగా జరగగా, స్వామివార్లు ఉదయం 5 గంటల నుండి రథం పై ఉండి భక్తులకు దర్శనం ఇవ్వగా, భక్తులు క్యూలైన్ లో నిలబడి, మొక్కులు పెడుతూ, టెంకాయ కొడుతూ, హుండీలో స్వామివారికి కానుకలు వేస్తూ, తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామ సర్పంచ్ దాసరపు సరోజన – రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ తాళ్లపల్లి మహేందర్ హనుమాన్, శ్రీ పద్మావతి అలివేణి మంగ సహిత వెంకటేశ్వర స్వామిని దర్శించుకోగా, వేద బ్రాహ్మణులు, గోత్రనామాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, కర్పూర హారతులు అందజేస్తూ, బ్రాహ్మణ ఆశీర్వాదాలు అందజేశారు. మధ్యాహ్న సమయంలో ఆలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహన్నదన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో భాగంగా భజన మండలి భక్తులు పాటలతో భక్తులను ఆనందింప చేశారు. ఈ ఉత్సవాల్లో హనుమాన్ స్వాములు, గోవింద స్వాములు, భజన భక్తి మండలి సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈ నెల 4న పంచముఖి బసవేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

-ధర్మగురు డాక్టర్ ఆనంద సరస్వతి మహారాజ్ స్వామి గారిచే




పోతంగల్ తెలంగాణ పత్రిక మే 2

పోతంగల్ మండలంలోని రాం గంగా నగర్ గ్రామంలో పంచముఖి బసవేశ్వర దేవాలయానికి మహకాళ అఖండ పీఠాధిపతి ఉజ్జయిని ధర్మగురు శ్రీశ్రీశ్రీ డాక్టర్ ఆనంద సరస్వతి మహారాజ్ స్వామి విచ్చేయుచున్నారని బిజెపి సీనియర్ నాయకులు ప్రకాష్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారిచే ఉదయం 8 గంటలకు ఆలయంలో అభిషేకం అర్చన ప్రవచనాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా అన్న ప్రసాద వితరణ దాతగా బాన్సువాడ నియోజకవర్గ బిజెపి నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. పోతంగల్ మండలంలోని చుట్టుపక్కల గ్రామాల భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రకాష్ పటేల్ కోరారు.

## నిరుపేదలకు అంత్యక్రియల కిట్టు అందజేస్తాం

-సామాజిక సేవకుడు ఎర్రోళ్ల నరేష్

కామారెడ్డి ,మే 02, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వైకుంఠధామం వద్ద పేదవారికోసం అంత్యక్రియల కిట్టు పూజ సామాగ్రి మీ ఉచితంగా అందజేయనున్నట్లు సామాజిక సేవకుడు ఎర్రోళ్ల నరేష్ తెలిపారు. గత 11 సంవత్సరాలుగా పార్టీపై ఉండే అనాథలకు రెండు రూపాయలకే భోజనం తాను అందజేస్తున్నారని అందులో భాగంగా కడసారి వీడ్కోలులో తోడుగా తన వంతుగా నిరుపేదల అంత్యక్రియలకు సంబంధించి అంత్యక్రియల కిట్టు పూజ సామాగ్రిని తాను వైకుంఠ దామం వద్ద అందజేయులకు నిర్ణయం తీసుకున్నానని ఆయన విలేకరులకు తెలిపారు.

## అమలాపురం బుల్లోడు కాదు... తెలంగాణ పోరాటాల పోరు బిడ్డ కూసపాటి

-దాసరి సాంబశివరావు దళిత నాయకులు
-దళితుల హక్కుల కోసం దశాబ్దాల పోరాటం...
-విభజన రాజకీయాలకు గట్టి హెచ్చరిక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 02 (తెలంగాణపత్రిక):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చర్మకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం రాజకీయ, సామాజిక పరంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా దళిత ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న కూసపాటి శ్రీనన్న ఈ దేశంలో భాషా ప్రతిపాదికన రాష్ట్రాలుగా ఏర్పాటు చేయకముందు మహారాష్ట్రలోని కొంత ప్రాంతం , కర్ణాటకలోని కొంత ప్రాంతాన్ని పూర్తి కలిపి హైదరాబాద్ అనే సంస్థానం నిజాం నవాబ్ పరిపాలనలో ఉండేది దాన్నే హైదరాబాద్సంస్థానంగా పిలిచేవారు విమర్శించేవారు అట్టి విషయాన్ని చదువు రాని వారు తెలుసుకోవాలని అన్నారు కానీ ఆంధ్రప్రదేశ్లోని అమలాపురానికి చెందిన వ్యక్తి కాదని ఎద్దేవా చేశారు తెలంగాణ పోరాటాల పోరు బిడ్డ. ఈ నేలపై దళితుల హక్కుల కోసం గత 30--40 సంవత్సరాలుగా నిరంతరం పోరాడుతున్నారు" అని దాసరి సాంబశివరావు స్పష్టం చేశారు. దళితుల అభ్యున్నతి కోసం వారి పోరాటాన్ని గుర్తు చేస్తూ, ఈ కొత్తగూడెం నడి బొడ్డున పుట్టి పెరిగి ఎన్నో కష్టనష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గకుండా దళితుల పక్షాన నిలబడ్డారు" అని పేర్కొన్నారు. ఇక చర్మకారుల సంఘంపై జరుగుతున్న విభజన రాజకీయాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "విభజించు -- పాలించు అనే విధానంతో కొందరు వేర్వేరు సంఘాల పేరుతో దళిత సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సమాజానికి మేలు చేయదు. ఇటువంటి ప్రయత్నాలను దళితులు తిప్పికొట్టాలి" అని హెచ్చరించారు. జిల్లాలో చర్మకారుల సంఘం ఒక్కటే బలంగా ఉండాలని, అందరూ అదే సంఘం కింద ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సంఘాన్ని బలహీనపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.



సమావేశంలో పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ, కూసపాటి శ్రీనివాస్ దళితుల కోసం చేసిన సేవలను కొనియాడారు. ఆర్థిక, సామాజిక పరంగా వెనుకబడిన వర్గాల కోసం ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు సంఘ ఐక్యతను కాపాడుతూ, దళిత హక్కుల సాధన కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశం దళిత సమాజంలో ఐక్యతకు నూతన దిశానిర్దేశం చేసినట్లు నాయకులు పేర్కొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



-ప్రొఫెసర్ డాక్టర్ సవిత, డాక్టర్ ప్రమీల

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 02 (తెలంగాణ పత్రిక):

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మన్నెవరి జలాల్పూర్ గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పచ్చిరొట్ట పంటల ద్వారా యూరియా సక్రమ వినియోగం, పంటల వైవిధ్యీకరణ అవసరం, పురుగుమందుల హానికర ప్రభావాలు వంటి కీలక అంశాలను వివరించారు. వరి, కూరగాయల పంటల్లో విత్తన శుద్ధి విధానాలు, వేప ఆధారిత స్ప్రేల వినియోగం ద్వారా సహజంగా చీడపీడల నియంత్రణ సాధ్యమని సూచించారు. డ్రిప్ సాగు ద్వారా నీటి సంరక్షణ, డ్రమ్ సీడర్ విధానం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. అలాగే సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు.



ఈ కార్యక్రమంలో పీజేటీయూ అధ్యాపకులు డా. బి. సవిత, డా. ఎం. ప్రమీల పాల్గొని రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రవేణి, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం రైతులకు ఉపయోగకరంగా మారి, కొత్త పద్ధతులను అవలంబించేందుకు ప్రోత్సాహాన్ని కల్పించింది.

## విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

-వ్యవసాయ రైతులు అప్రమత్తంగా ఉండాలి
-అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్ జి.

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 02:

విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు వ్యవసాయ రైతులు,ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్.జి తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా మే 1వ తేదీ నుండి మే 7వ తేదీ వరకు విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్.జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, టీజీఎన్పీడీసీఎల్ ఎస్ ఈ బిక్షపతి లతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి మాట్లాడుతూ వ్యవసాయ రైతులు, ప్రజలు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదాల బారీ నుంచి రక్షణ పొందేందుకు తగు జాగ్రత్తలను తూ.చా తప్పకుండా పాటించాలని సూచించారు. వ్యవసాయ రైతులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం, పంపుసెట్లను, విద్యుత్ మోటర్లను, ఇనుప పైపులను, ఫుట్ వాల్ లను ఏమరపాటుగా తాకకూడదని, వాటిలో విద్యుత్ ప్రసారం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని స్వీయ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలను,తెగిపడిన తీగలను, స్టార్టర్ డబ్బాలను ముట్టుకోకూడదని, తెగిపడిన తీగలు చెట్ల కొమ్మలకు తాకి అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఇంటి ఆవరణలో జి ఐ వైర్ ను ఉపయోగించి తడి బట్టలను ఆరవేయడం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేశారు. ముందుగా ఎస్ ఈ బిక్షపతి మాట్లాడుతూ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను సరి చేయడం అత్యంత ప్రమాదకరమని, వీధి దీపాలను సరి చేసేందుకు ఇతరులు విద్యుత్ స్తం భాలను ఎట్టి పరిస్థితిలో ఎక్కరాదని విద్యుత్ శాఖ సిబ్బంది కి వెంటనే



తెలియజేయాలని అన్నారు.ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గర్లోని వ్యక్తులు వారిని రక్షించాలని ఆత్రుతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోకూడదని, విద్యుత్ ప్రవహించని వస్తువులతో కరెంట్ షాక్ కు గ్రీన్ వ్యక్తిని వేరు చేయడం సరైన మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, డిఈపి నాగేశ్వరరావు, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, వైస్ చైర్ పర్సన్ ఆసియా షహీన్, డి.ఎస్.పి రవీందర్, డిపిఆర్ఓ రఫిక్, డి డబ్ల్యు ఓ ప్రేమలత,ఏటూరు నాగారం డి ఈ ఎన్ పురుషోత్తం, ములుగు ఏడిఈఎన్ వేణుగోపాల్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

-ప్రజలతో మమేకమై అభివృద్ధి సాధించాలి
-జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్.జి

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 02:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలతో మమేకమై సంపూర్ణ సమగ్ర అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నా 99 రోజుల ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆర్డీవో వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి హాజరై రాష్ట్ర గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి వివరాలను పి పి టి ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు.




ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, త్వరలో అమలు చేయబోయే మరిన్ని సంక్షేమ పథకాలకు గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో సమగ్రంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జనగణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 26వ తేదీ నుంచి,మే 10వ తేదీ వరకు జరుగుతున్న సెల్ఫ్ ఎన్యునరేషన్ లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు రూపొందించిన యాక్షన్ ప్లాన్ తో ముందుకు సాగాలని ప్రజలు అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను



ప్రజలలోకి తీసుకువెళ్లాలి కోరారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ మాట్లాడుతూ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఏర్పడిన అనంతరం ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని తీసుకురావడం సంతోషకరంగా ఉందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రెండు కొత్త బోర్ వేల్స్ ను వేయడం జరిగిందని, ఆరు పాత బోర్వెల్స్ ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశామని, వేసవికాలం దృష్ట్యా ఐదు చలివేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 20 వార్డులలోని సమస్యలను స్థానిక కౌన్సిలర్లతో పర్యవేక్షించి పరిశీలించడం జరుగుతుందని వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రవీందర్, మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ ఆసియా షాహిన్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీణవంక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న యుఫ్ టీవీ సీఈఓ పాడి ఉదయనందన్ రెడ్డి






వీణవంక ప్రతినిధి,మే 2( తెలంగాణ పత్రిక).

వీణవంక మండల కేంద్రంలోశ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వీణవంక పున్నమి జాతర బ్రహ్మోత్సవాలలో శనివారం యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి పాల్గొని, రథంపై ఆసీనులైన స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం మహ అన్నదానంలో పాల్గొని భక్తులకు కనువిందు చేశారు. ఆలయానికి విచ్చేసిన పాడి ఉదయ్ రెడ్డికి సాదర స్వాగతం పలుకుతూ, వేదమంత్రాలతో, గోత్రనామాలతో బ్రాహ్మణ ఆశీర్వాదం అందజేస్తూ ప్రత్యేక పూజలు చేస్తూ, కండువా కప్పి స్వామివారి జ్ఞాపకం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలోని పవిత్ర క్షేత్రం వీణవంక శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ దివ్య స్థలం లక్షలాది భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన ఆధ్యాత్మిక కేంద్రం. వేయి సంవత్సరాల వైభవ చరిత్ర కలిగిన వీణవంక క్షేత్రంలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వారు యుగయుగాలుగా భక్తుల మొక్కులు స్వీకరిస్తూ, వారి కష్టాలను తీర్చి, కోరికలు నెరవేర్చే కల్పవృక్షంగా విరాజిల్లుతున్నారు. పున్నమి జాతర బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్న ఈ మహాపర్వదినాలలో బ్రహ్మోత్సవాల్లో సర్వోత్కృష్టమైన, అత్యంత పవిత్రమైన రథోత్సవం రోజున స్వామివారు రథారూఢులై భక్తులకు సాక్షాత్కరిస్తున్న ఆ దివ్య మంగళ ఘడియలలో స్వామివారి దర్శన భాగ్యం పొంది, తమ మనసులో నిక్షిప్తమైన మొక్కులను పూర్ణ భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని కొనియాడారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడం ప్రభుత్వ లక్ష్యం

-ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి , మే02, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం కామారెడ్డిజిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి చేరవేయడం లక్ష్యమని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ ప్రధాన పథకాలపై ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన కల్పించడంతో పాటు, స్థానిక అభివృద్ధి అవసరాలు, సమస్యలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం అమలులో ఉన్న రైతు భరోసా, రైతు బీమా, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పెన్షన్లు, కల్యాణలక్ష్మి / షాదీ ముబారక్ వంటి పథకాల గురించి వివరించారు. అలాగే రాబోయే రోజుల్లో అమలు చేయనున్న మహిళా శక్తి బ్యాంక్, వడ్డీలేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, అల్పాహార పథకం (రాగిజావ/పాలు), ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, పంటల వైవిధ్యీకరణ, సేంద్రీయ వ్యవసాయం వంటి పథకాలపై కూడా అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక పాలనను మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు , ప్రజల మధ్య ప్రత్యక్ష సంబంధాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రాబోయే రోజుల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సంక్షేమం తదితర రంగాలపై నేపథ్య వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, లబ్ధిదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుల ను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళనలో రైతులు

-ఎం సిపిఐ యు పార్టీ జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య..........

-టిఆర్ఎస్ పార్టీ నాయకుడు గోవింద నాయక్.

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి మే 02 తెలంగాణ పత్రిక



ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో మొక్కజొన్న రైతులు ఆందోళన అంబేద్కర్ సెంటర్లో రాస్తారోకో చేపట్టిన రైతులు ఈ ధర్నాను ఉద్దేశించి మాట్లాడిన నాయకులు గతల నెల8 తారీకు ములుగు జిల్లాలో మార్క్ఫెడ్ సంస్థ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం 25 రోజులు అయినప్పటికీ సక్రమంగాకొనుగోలు జరగకపోవడం బార్దాన్ సప్లై లారీల సప్లై జరగకపోవడంతో రైతులు నెల రోజుల నుంచి కొనుగోలు సెంటర్లో పడిగాపులు కాస్తూ వడగాళ్ల వర్షాలు ఎప్పుడు వచ్చి నష్టం జరుగుతుంది అని ఆందోళనతో గురవుతున్న రైతులు అని అన్నారు ప్రభుత్వం అధికారులు ప్రజా ప్రతి నిధులు మంత్రులు వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని ఆందోళన వ్యక్తం చేసినారు పేరుకే ప్రజా ప్రభుత్వం ఈ రబ్బి సీజన్లో పెద్ద మొత్తంలో రాష్ట్రంలో మొక్కజొన్న పండి ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి ప్రభుత్వం సమీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు గన్ని బ్యాగులు లారీలు సప్లై చేయకపోగా పెద్ద ఎత్తున దళారులు రైతులను దోసుకుంటున్నారని విసుకు చెందిన రైతులు కొనుగోలు సెంటర్లలోనే మధ్య దళారులకు 1800 రూపాయల క్వింటాకు అమ్ముకుంటున్నారు రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రభుత్వం రైతుల బాధలు కనిపిస్తలేవని ప్రభుత్వాన్ని విమర్శించినారు ఇప్పటికైనా ప్రభుత్వం తగినన్ని గన్ని బ్యాగులు లారీల సప్లై చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసినారు. ఈ ధర్నాను ములుగు పోలీస్ సిఐ ఎస్ఐ వచ్చి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని ధర్నాను విరమించాలని రైతులతో చర్చలు జరిపినారు ములుగు జిల్లా కలెక్టర్ మహేందర్ జి తో ఫోన్ ద్వారా మాట్లాడిన సిఐ రైతు ధర్నాను విరమింప చేసినారు అనంతరం రైతు ప్రతినిధులు అయిదుగురి తో కలెక్టర్ ఆఫీసుకు తీసుకెళ్లి చర్చించినారు. మల్లంపల్లిలోనే కొనుగోలు సెంటర్ ఏర్పాటుచేసి సహకార సంఘం ద్వారా ప్రారంభిస్తామని హామీ ఇచ్చినారు కలెక్టర్ మార్క్ ఫెడ్ డిఎం తో మాట్లాడి కలెక్టర్ మల్లంపల్లి సబ్ సెంటర్ ను రద్దుచేసి రామచంద్రాపురం మక్కల కొనుగోలు కేంద్రం థతోసంబంధం లేకుండా మంత్రి సీతక్క తో తోటి మాట్లాడి సపరేట్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినారు ఈ కార్యక్రమంలో రైతులు పార్టీలకతీతంగా పాల్గొని రెండు గంటలపాటు రాస్తారో కో చేసి హైవే రోడ్డు మీదమొక్కజొన్నలు పోసుకొని టైర్లు వేసి తమ నిరసన వ్యక్తం చేసినారు పాల్గొన్న రైతులు సిటీ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి గోల్కొండ రవి మాజీ సర్పంచ్ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్ గోల్కొండ రాజు మెరుగు రవి ఇమ్మడి ప్రవీణ్ సత్తు రామ్మూర్తి సత్యం సెట్ రెడ్డి మల్లారెడ్డి గూడెపు కర్ణాకర్ రెడ్డి పిల్లి ఐలయ్య లక్ష్మణరావు వారితోపాటు 200 మంది రైతులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక భాగంగా ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం

-గ్రామ సభలు మండల స్థాయి సమావేశాలు విజయవంతంగా నిర్వహించాం... ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ

మిర్యాలగూడ ప్రతినిధి//మే 2:(తెలంగాణ పత్రిక):-



మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్ర భారతి నందు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మరియు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా మనం గ్రామ సభలు, మండల స్థాయి సమావేశాలు విజయవంతంగా నిర్వహించాం. ఈ రోజు నియోజకవర్గ స్థాయిలో మన ప్రగతిని, సమస్యల పరిష్కారాన్ని సమీక్షించుకుంటున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం 'పజాపాలన ప్రజల ఇంటి తలుపు తట్టాలి అనే లక్ష్యంతో పనిచేస్తోంది. అదే లక్ష్యంతో మన నియోజకవర్గంలో వేలాది కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇల్లు లేని పేదల కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నూతన ఇండ్ల మంజూరు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాం. రైతులకు పెట్టుబడి సాయం, పెండింగ్ రుణమాఫీ ప్రక్రియ వేగవంతం చేశాం వ్యవసాయం మే 4నుండి 9 వరకు వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి, పంట మార్పిడిపై రైతులకు అవగాహన..ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ప్రతి ఇంటి ఆరోగ్యంపై సర్వే, రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పెండింగ్ ఫైళ్లు ఏవీ ఉండకూడదు. అధికారులు డిజిటల్ గవర్నెన్స్ ఈ-ఆఫీస్ పద్ధతిలో పని చేయాలి. నేను స్వయంగా ప్రతివారం సమీక్షిస్తాను. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న మనం జరుపుకోబోయే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి మన నియోజకవర్గం 'పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా ఉండాలి అని అన్నారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పండుగలా తయారవ్వాలి. ఈ 99 రోజుల కార్యక్రమాన్ని మీరందరూ బాధ్యతగా విజయవంతం చేయాలని కోరుతున్నాను. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, మనందరి అభివృద్ధి ప్రణాళిక అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమరుల స్ఫూర్తితో యువతరం పోరాటాలకు సిద్ధం కావాలి

-సిపిఎం నేతల పిలుపు



మరిపెడ రూరల్, మే 2:(తెలంగాణ పత్రిక)

అమరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకుని నేటి యువతరం పాలకవర్గాల దోపిడిపై పోరాటం చేయాలని సిపిఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అల్వాల వీరయ్య పిలుపునిచ్చారు. ఎల్లంపేట గ్రామంలో అమరజీవి కామ్రేడ్ లింగంపల్లి బిక్షపతి మొదటి వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో అల్వాల వీరయ్య మాట్లాడుతూ, బిక్షపతి గ్రామంలో సిపిఎం నిర్మాణానికి పునాది వేసిన నాయకుడని అన్నారు. గ్రామ పార్టీ కార్యదర్శిగా, ప్రజా నాట్యమండలి నాయకుడిగా పనిచేసి కూలీలు, భూమి, ఉపాధి సమస్యలపై నిరంతరం పోరాడారని తెలిపారు. పెత్తందారుల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదిరించి, కేసులు, జైలు శిక్షలను కూడా లెక్కచేయకుండా పార్టీకి అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. తన జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి ఎర్రజెండాను విడవకుండా పోరాడిన బిక్షపతి, మరణానంతరం తన శరీరాన్ని మెడికల్ కాలేజీకి దానం చేయాలని నిర్ణయించుకోవడం ఆయన సేవాభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. తన కుమారుడు లింగంపల్లి దయానంద్‌ను కూడా అదే మార్గంలో నడిపించారని, ప్రస్తుతం ఆయన జన విజ్ఞాన వేదికలో రాష్ట్ర స్థాయి నాయకుడిగా కొనసాగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు తక్కెళ్లపల్లి వీరభద్రం, కోశాధికారి జంపాల యాకన్న మాట్లాడుతూ, పేదల కోసం పోరాడిన బిక్షపతి ఎల్లంపేట గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన పేరు గ్రామంలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ఆర్గనైజర్ బోనాల రాజన్న, జిల్లా నాయకులు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, ఎల్ఐసి యూనియన్ నాయకులు, గ్రామ ప్రజలు, బిక్షపతి కుటుంబ సభ్యులు కమలమ్మ, దయానంద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పోరాటం చేసైనా గుట్ట క్వారీ పనులను ఆపుకుందాం

-రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు




దేవరుప్పుల, మే 2 (తెలంగాణ పత్రిక):

పోరాటం చేసైనా వాన కొండయ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్టపై చేస్తున్న క్వారీ పనులను ఆపుకుందామని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం దేవరుప్పుల బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగిన అనంతరం శుక్రవారం బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, గుట్ట పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు అడ్డుకున్న క్వారీ పనుల గురించి ఆయన ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్ ఆన్ లైన్ టెండర్ వేసి పనిని దక్కించుకున్నట్టు తెలిపారు. దేవుని గుట్ట కావడం వల్ల వాటి జీవోను ప్రభుత్వంతో రద్దు చేయించామన్నారు. అంతేకాకుండా ఇక్కడి ప్రజలు, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పనులను అడ్డుకొని నిలిపివేశారని గుర్తు చేశారు. కాంట్రాక్టర్ కోర్టుకు వెళ్లి తిరిగి అనుమతులు తెచ్చుకున్నప్పటికీ మన కార్యకర్తలు మరోసారి అడ్డుకొని కేసుల పాలు కూడా అయ్యారన్నారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ అదే రీతిలో మళ్లీ రెండు సంవత్సరాల తర్వాత క్వారీ పనులను మొదలుపెట్టారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని నడవనీయవద్దని సూచించారు. లక్ష్మీనరసింహస్వామి గుట్టను చెరపనిచ్చేది లేదని తేల్చి చెప్పారు.

## బిఆర్ఎస్ నాయకుడు ధారావత్ వికాస్ వివాహ వేడుకలో పాల్గొన్న జిల్లా నాయకులు

కారేపల్లి,మే02(తెలంగాణ పత్రిక):



మండల పరిధిలోని మాణిక్యరం గుడి తండా గ్రామానికి చెందిన సింగరేణి మండలం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధారావత్ వికాస్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి మండల బీఆర్ఎస్ నాయకులు వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు డొంకెన రవీందర్ గౌడ్,లాకవత్ రాము,రామారావు,జిల్లా మైనార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్, తెలంగాణ ఉద్యమ నాయకుడు సోమందుల నాగరాజు, యువజన నాయకులు జడల కళ్యాణ్,గూగులోత్ రవి (బిల్ రవి)తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.నూతన దంపతులు సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని నాయకులు ఆకాంక్షించారు.

## ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో అభివృద్ధి పనులు



ముధోల్: 02మే(తెలంగాణ పత్రిక)

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి దిశగా పయనించేందుకు ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల పాలనపై శనివారం బైంసా పట్టణంలోని సురోలోక్ గార్డెన్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల సర్పంచ్ లు, అధికారులు పాల్గొన్నారు. ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో 99 రోజు ప్రణాళికల భాగంగా జరిగిన పనుల పైన సర్పంచ్ రావుల లావణ్య -శ్రీనివాస్ ప్రొజెక్టర్ పై సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ కు చేసిన అభివృద్ధి పనులపై వివరించారు. గ్రామంలో తాగునీటి, సిసి రోడ్లు, శానిటేషన్, పారిశుద్ధ్యం, దోమల పిచికారి, గ్రావెల్స్ రోడ్లు, పశువులకు నీటు తొట్టిలు, ఉపాధి హామీ కూలీల సంఖ్య,పెంచేందుకు అవగాహన కార్యక్రమాలతో గ్రామ అభివృద్ధిలో భాగంగా పనులను చేసినట్లు వివరించారు. అష్ట గ్రామాన్ని అభివృద్ధి పథంలో కొనసాగించిన పనులను పర్యవేక్షించాలని కోరారు.దీంతో సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలో అష్ట గ్రామాన్ని సందర్శిస్తానని సబ్ కలెక్టర్ తెలిపారు.

## కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి కి పరువునష్టం దావా నోటీసులు



కామారెడ్డి, మే0 2, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసినట్లు హైకోర్టు న్యాయవాది సుమంత్ పేర్కొన్నారు. శనివారం కామారెడ్డిలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. గత ఫిబ్రవరి 17, 21 న జరిగిన మీడియా సమావేశాల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తనయుడు ఇలియాస్‌పై రేప్ కేసు ఉందని, అనుచిత వ్యాఖ్యలు, అవాస్తవాలు మాట్లాడారన్నారు. ఈ విషయమై తనపై అసత్య ఆరోపణలు చేశాడని, అవాస్తవాలు మాట్లాడి తనకు పరువుకు నష్టం కలిగించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇలియాస్ కోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో కోర్టు ఫిర్యాదు పూర్వపరాలను పరిశీలించి క్రిమినల్ డిఫమేషన్ కింద ఈ నెల 20 న కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కావాలని నోటీసులు జారీ చేసిందన్నారు. సమావేశంలో స్థానిక న్యాయవాదులు సతీష్, స్టీఫెన్ రాజు, గంగారం పాల్గొన్నారు.

## కామారెడ్డి కవికి ప్రశంసలు

కామారెడ్డి,మే02,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



సిద్ధి సొసైటీ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ , మంథనీ పద్య సాధన బృందంసంయుక్తంగా నిర్వహించిన అక్షర వసంతం లో పాల్గొని తన పద్య కవితను వినిపించినకామారెడ్డిమున్సిపాలిటీ పరిధిలోనిలింగాపూర్కు చెందినవైద్య. ఉమాశేషారావు కు ఆ సంస్థ ప్రముఖులు కొల్లరపు ప్రకాష్రావుశర్మ, శ్రీ వెంకట్ కొత్తూర్, ఫౌండర్ అరుణ నక్కెళ్ల కవి ని ప్రశంసిస్తూ ప్రత్యేక ప్ర సంశ పాత్రము అందిం చారు.

# రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ






-వరంగల్ సభకు రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలి
-రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

దేవరుప్పుల, మే 2 (తెలంగాణ పత్రిక):

రైతుల పండించిన ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు కొంటామని చెప్పి కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరగక ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన మక్కలు, వరి ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాల్లో పోసుకొని నిరీక్షిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఇప్పటికి తూకాలు వేసి తరలించడం లేదన్నారు. రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని నిరూపించు కుందన్నారు. కొనుగోలులో జాప్యం వహిస్తూ రైతులు నష్టపోవాలని చూస్తున్నారన్నారు. రైతుల నోట్లో మన్ను కొట్టాలని చూసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన ఎద్దేవా చేశారు.రైతులను మోసం చేసిన కాంగ్రెస్ తీరును ఎండగట్టేందుకు వరంగల్ నగరంలో ఈనెల 6న బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రైతు సభ నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. సభకు ముఖ్యఅతిథిగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ హాజరుకానున్నట్టు తెలిపారు. డిక్లరేషన్లు ప్రకటించిన చోటే బీఆర్ఎస్ సమర శంఖం మోగిస్తున్నట్టు ఆయన వివరించారు. రైతు సభకు రైతులు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జనగామ జిల్లా నాయకులు పల్లా సుందర్ రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తీగల దయాకర్, మాజీ అధ్యక్షులు బస్వ మల్లేశం, మండల నాయకులు కొల్లూరు సోమయ్య, ఏల సుందర్, అనంతోజు కృష్ణమూర్తి, గండిపల్లి యాకయ్య, మలిపెద్ది శ్రీనివాసరెడ్డి, కుతాటి నరసింహులు, కొత్త జలంధర్ రెడ్డి,ఆలకుంట్ల యాదగిరి, ఈదునూరు నరసింహారెడ్డి, కారు పోతుల బిక్షపతి, చింత రవి, రామ్ సింగ్, ఇంటి మల్లారెడ్డి, చింత యాదగిరి, తోటకూరి క్రిష్టయ్య, బిల్లా యాదవ్ రెడ్డి, కత్తుల సోమిరెడ్డి, మేకపోతుల నరసింహులు, సోషల్ మీడియా నాయకులు, యువజన నాయకులు, పలు గ్రామాల ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల రీయంబర్స్మెంట్ స్కీమును ఎత్తి వేయడానికే జీవో నెంబర్ 7ను తీసుకవచ్చారు

-జీవో నెంబర్ 7ప్రతుల దగ్ధం చేసిన బీసీ జేఏసీ నాయకులు
-ఆనాటి కాంగ్రెస్ ఫీజుల స్కీం తెస్తే, ఈనాటి కాంగ్రెస్ ఈ స్కీమును రద్దు చేయాలని చూస్తుందని... జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ ప్రతినిధి//మే 2:(తెలంగాణ పత్రిక):–



2008 సంవత్సరంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని తీసుకువస్తే 2026లో నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తుందని బీసీ జేఏసీ కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్ నీరు కార్చే జీవో నెంబర్ 7ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఫీజుల రీయంబర్స్మెంట్ బకాయిలు గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వాలు విడుదల చేయకపోవడంతో కొన్ని కళాశాల యజమాన్యాలు హైకోర్టుకు వెళ్లారని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున విద్యార్థుల పక్షాన బలమైన వాదనలు వినిపించాల్సిన ప్రభుత్వం ఫీజుల రియంబర్స్మెంట్ స్కీమును దశలవారీగా రద్దు చేసే కుట్రలో భాగంగానే కోర్టుకు సరైన వాదనలు వినిపించలేదని ఆయన ఆరోపించారు. దీనితో విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేసుకోవచ్చు అని రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని, ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని యధావిధిగా కొనసాగిస్తామని హైకోర్టుకు నివేదించాల్సిన ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా యజమాన్యాల ఖాతాలకు కాకుండా విద్యార్థుల ఖాతాలకే ఫీజుల నిధులు చెల్లిస్తామని తేనె బూసిన కత్తిలా జీవో నెంబర్ 7ను విడుదల చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో నెంబర్ ఏడు విడుదల చేయడమంటే పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేయాలనే కుట్ర దాగి ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, ఫరూఖ్, ఊరిబండి శ్రీనివాస్ యాదవ్, ఎస్పీ నాయుడు, బంటు సైదులు, అంజి, రాంబాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రాంపురం గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి పెరిగిన దాతలు





పరకాల గీసుకొండ మే 02 తెలంగాణ పత్రిక

రాంపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం ప్రతిష్టాపన కార్యక్రమం కోసం గ్రామ ప్రముఖులు, దాతలు ఉదారంగా విరాళాలు అందజేశారు.ఈ సందర్భంగా ముందుగా రాంపూర్ సర్పంచ్ రడం భరత్ కుమార్ రూ. 1,00,116/– విరాళాన్ని అందజేశారు. అనంతరం గుడి చైర్మన్ తాబేటి వెంకటేశ్వర్లు రూ. 50,116/– విరాళాన్ని సమర్పించారు. తరువాత తాబేటి వీరస్వామి రూ. 50,116/– విరాళం అందజేశారు.అలాగే గీసుగొండ మాజీ జడ్పిటిసి పోలీసు ధర్మారావు రూ. 51,116/– విరాళాన్ని అందజేశారు. కీ.శే. జన్నపురెడ్డి నారాయణరెడ్డి ఒ విజయలక్ష్మి కుటుంబం రూ. 25,000/– గజ్జి రవి రూ. 25,000/– విరాళాలను సమర్పించారు. శనివారం రోజు మొత్తం అందిన విరాళం: రూ. 3,01,464 ఈ సందర్భంగా గ్రామస్థులు దాతల సేవాభావాన్ని అభినందిస్తూ, అభయ ఆంజనేయ స్వామి ఆశీస్సులు వారికి ఎల్లప్పుడూ ఉండాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతోసుఖసంతోషాలతో,అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో అందరూ కలిసికట్టుగా ముందుకు రావడం శుభపరిణామమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

## గంభీరావుపేట సర్పంచ్ పై ప్రశంసల జల్లు కురిపించిన పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్





గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 2

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో నిర్వహించిన ఆత్మనిర్భర్ రాజకీయ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భారద్వాజ్ గంభీరావుపేట మేజర్ గ్రామ సర్పంచ్ మల్లుగారి పద్మ నర్సగౌడ్ పై విజయంపై ప్రశంసలు కురిపించారు ఎలాంటి ఖర్చులు లేకుండా, ప్రచార సాధనాలు ఉపయోగించకుండా, పోలింగ్ ఏజెంట్లు లేకుండానే తెలంగాణలోనే భారీ మెజారిటీతో గెలిపించిన గంభీరావుపేట గ్రామ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి తీర్పు నిజంగా ఆదర్శనీయమని పేర్కొన్నారు ఐదు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాభిమానంతో ఘనవిజయం సాధించిన మల్లుగారి పద్మ నర్సగౌడ్ కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ విజయం ప్రజాస్వామ్యవాదుల్లో కొత్త ఆశలకు పునాది వేసిందని ప్రశంసించారు ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి (ఆర్డబ్ల్యూఎస్) ప్రత్యేక కార్యదర్శి శ్రీ ఎం.ధన కిశోర్ డి. దివ్య ఐఏఎస్ (పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్)నాబార్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు నాబార్డ్ ప్రతినిధులు గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు

# ఇంటర్ లో రాష్ట్రస్థాయి ర్యాంకుల విద్యార్థులకు సన్మానం

కామారెడ్డి, మే 02, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి పట్టణంలోని సాందీపని జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుతూ అగ్ర ర్యాంకులు సాధించిన సందర్భంగా, పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బైపీసీ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర ద్వితీయ ర్యాంకు సాధించిన అస్మాజబిన్, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర మూడవ ర్యాంకు సాధించిన సాత్విక, ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో రాష్ట్ర ద్వితీయ ర్యాంకు సాధించిన కే. అక్షయ, బైపీసీ ప్రథమ సంవత్సరంలో రాష్ట్ర నాలుగవ ర్యాంకు సాధించిన ఆయేషా సిద్ధేఖలను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన ఈ అద్భుతవిజయాలు కామారెడ్డి జిల్లాకు గర్వకారణమని అన్నారు. పట్టుదల, కృషి, సమయపాలనతో చదువుకుంటే ఎవరైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులు నిరూపించారని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆయన కొనియాడారు. గురువుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం లేకుండా ఇలాంటి విజయాలు సాధ్యం కాదని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో చదువుకుని దేశానికి



ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అలాగే ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రతిభ కలిగిన విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందిస్తుందని తెలిపారు. మరిన్ని విజయాలు సాధించి కామారెడ్డి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన -- ప్రగతికి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో కామారెడ్డి నియోజకవర్గం సమీక్ష

కామారెడ్డి, మే 02, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కామారెడ్డి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతిలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 57వ రోజు పురోగతిపై సంబంధితఅధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కామారెడ్డి, రాజంపేట, బిక్నూర్, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, రామారెడ్డి మండలాలకు చెందిన అధికారులు, మహిళా సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో గత 57 రోజులుగా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందించిన సేవల వివరాలను సమర్పించారు. శాఖల వారీగా లక్ష్యాల సాధన, పురోగతి, ఇంకా పూర్తి చేయాల్సిన పనులపై చర్చించి రాబోయే రోజుల్లో మరింత చురుకుదనంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికి సంబంధించిన వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వహణ కోసం



రూ.71,97,307 విలువైన చెక్కును కామారెడ్డి నియోజకవర్గంలోని రాజంపేట, బిక్నూర్, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, రామారెడ్డి, కామారెడ్డి మండల సమాఖ్య అధ్యక్షులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ప్రతి అధికారి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు కామారెడ్డి మున్సిపల్ చైర్మన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్, రాజకీయ నాయకులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులుగ్రామీణ అభివృద్ధి అధికారి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు వార్డు సభ్యులు, ఐకెపి ఏపీఎంలు, సీసీలు, బి ఓ లులు, మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఈ సమీక్ష సమావేశం ద్వారా అభివృద్ధి కార్యక్రమాల అమలుపై స్పష్టమైన దిశానిర్దేశం లభించిందని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా అమలవుతాయని అధికారులు తెలిపారు.

# కొత్తపల్లిలో ఘనంగా శ్రీ వేణుగోపాలస్వామి రథోత్సవం

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 2

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి శనివారం రోజున స్వామివారి భక్తులకు రథోత్సవం పై దర్శనమిచ్చారు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత నూతనపురి శ్రీ వేణుగోపాలస్వామి పురవీధుల గుండా ఊరేగింపుగా థర్డ్ వెళ్తుండగా చిన్నారులు దాండియా కోలాటాలు డీజే పాటలతో నృత్యాలు చేస్తూ భక్తులను కనువిందు చేశారు స్వామివారికి మహిళలు మంగళహారతితో వచ్చి దర్శించుకుని వారి ముక్కులను చెల్లించుకున్నారు గ్రామంలో గోవింద నామస్మరణతో మారుమోగింది స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల మండల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ రథోత్సవంలో శివసేన రాష్ట్ర నాయకులు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గణేష్ గౌటే డీఎస్పీ



నాగేంద్ర చారి స్థానిక ఎస్సై అనిల్ కుమార్ గ్రామ సర్పంచ్ బాలరాజు గౌడ్ ఆలయ చైర్మన్ శ్రీనివాస గౌడ్ బీసీ అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు సెక్స్ డైరెక్టర్ గౌరీనేని నారాయణరావు మాజీ సింగల్ విండో చైర్మన్ రాజ నర్సింహారెడ్డి ఆలయ వైస్ చైర్మన్ బాల్ రెడ్డి ఉప సర్పంచ్ ప్రియాంక మాజీ ఎంపీపీ వంగ కరుణ సురేందర్ రెడ్డి గుర్రం దేవ గౌడ్ జోగు రాజయ్య రాజనర్సు సంజీవ్ జగన్ తోపాటు ఆలయ కమిటీ సభ్యులు వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు



అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున స్వామివారినీ దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# రైతులు యూరియా వాడకం తగ్గించాలి







-వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జి. సంతోష్ కుమార్

నంగునూరు, మే 02(తెలంగాణ పత్రిక);

రైతులు యూరియా వాడకాన్ని తగ్గించడం ద్వారా పంటల సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని సిద్ధిపేట జిల్లా తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ జి. సంతోష్ కుమార్ సూచించారు. నంగునూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ జి.సంతోష్ కుమార్, వ్యవసాయ శాస్త్రవేత్త జి.నీలిమ పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనాలను అవసరం మేరకు మాత్రమే వినియోగించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. పంట మార్పిడి విధానాన్ని పాటించి స్థిర ఆదాయం పొందవచ్చునని తెలిపారు. మార్కెట్లో లాభసాటిగా ఉన్న వరి రకాలను సాగు చేయాలని సూచించారు. వివిధ పంటల్లో సాగునీటిని ఆదా చేసే అవసరమైన పరిజ్ఞానాన్ని వివరించారు. ప్రత్యామ్నాయ పంటల వివరాలను తెలియజేశారు. సేంద్రీయ పద్ధతులపై అవగాహన కల్పించారు. పంట అవశేషాలు తగల బెట్టకుండా నేల ఆరోగ్యాన్ని కాపాడాలని చెప్పారు. జిలుగు, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి ఏపుగా ఎదిగిన తరువాత కలియ దున్నాలని చెప్పారు. వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను సాగు చేయాలని చెప్పారు. దీనివల్ల పురుగు తెగుళ్ళు తక్కువగా ఆశించి పురుగు ,తెగుళ్ల మందులు వాడాల్సిన అవసరం తగ్గుతుందన్నారు. ఫలితంగా అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తూ సమగ్ర వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జె. సాయి వర్మ , ఎ. పవన్, ఎస్. బాపురాజు, ఎం. చైతన్య, నంగునూరు గ్రామ సర్పంచ్ సనాదుల బాలపోచయ్య, రైతులు పాల్గొన్నారు.

## మైనింగ్ వద్దు... లక్ష్మీనరసింహుడి గుట్ట ముద్దు

-రైతుల జీవనోపాధిని దెబ్బతీసే తవ్వకాలను ఆపాలి

-బి ఆర్ ఎస్ పార్టీ జనగామ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాం రెడ్డి



దేవరుప్పుల, ఏప్రిల్ 2 (తెలంగాణ పత్రిక):

మైనింగ్ వద్దని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి గుట్ట మొద్దు అని బి ఆర్ ఎస్ జనగామ జిల్లా నాయకులు పల్లా సుందర్ రామిరెడ్డి అన్నారు. దేవరుప్పుల మండలం లకవత్ తండా వద్ద వాన కొండయ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్టలో అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతుండగా ఆ ప్రాంత ప్రజలతో పాటు మండల బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆ ప్రాంతాన్ని ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల జీవనోపాధిని దెబ్బతీసే తవ్వకాలను వెంటనే ఆపాలని ఆయన నిరసన వ్యక్తం చేస్తూ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో వానకొండయ్య గుట్టలో అక్రమ తవ్వకాలు జరుగుతుండగాపాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి చోద్యం చూస్తున్నారన్నారు. వాన కొండయ్య గుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవుడికి అతి సమీపంలో తవ్వకాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అక్రమ తవ్వకాల వల్ల సాగు భూములు పాడవుతున్నాయని, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ తవ్వకాలను ఆపకపోతే గ్రామస్తులు రైతులతో కలిసి రహదారిపై ధర్నా, రాస్తారోకోలతో పాటు నిరసనలు ఉధృతం చేస్తామని ఆయన తేల్చి చెప్పారు. వాన కొండయ్య గుట్టను కాపాడడం కోసం తమ బిఆర్ఎస్ పార్టీ రైతులు, ఆ ప్రాంత పరిసర గిరిజన తండాల ప్రజలకు అండగా నిలబడుతుందన్నారు. వెంటనే కాంట్రాక్టర్ గుడారాలు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఆయన హెచ్చరించారు. సంబంధిత జిల్లా కలెక్టర్ ప్రాంత రైతాంగాన్ని, లక్ష్మీ నరసింహ స్వామిని దృష్టిలో ఉంచుకొని వెంటనే అనుమతులను రద్దు చేయాలని కోరారు. వాన కొండయ్య గుట్టను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆ ప్రాంత గ్రామాల గిరిజన తండాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

నంగునూరు, మే 2(తెలంగాణ పత్రిక):





పదో తరగతిలో చూపిన ప్రతిభతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని తమ ఉన్నత చదువులను కొనసాగించాలని సిద్ధన్నపేట గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడు సంగు రమేశ్ అన్నారు. గ్రామానికి చెందిన వడ్డేపల్లి శ్రీధర్, మంజుల దంపతుల కుమార్తె వడ్డేపల్లి నిహారిక నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి పదవ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు 565 మంచి మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రతిభ కనబరిచింది. దీంతో పద్మశాలి సంఘం తరఫున శుక్రవారం రాత్రి వడ్డేపల్లి నిహారికను సన్మానించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు సంగు రమేశ్ మాట్లాడుతూ చదువులో మరింత రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగు ఆంజనేయులు, సంగు బాలకిషన్, కారంపూరి మల్లేశం, సంగు మధు, సంగు రోహిత్ పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశాం

-జిల్లా కలెక్టర్ కె హైమవతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి , మే 02 (తెలంగాణ పత్రిక):

నీట్ -2026 మే 3న జరగబోయే పరీక్షకు సంబంధించి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 2 సెంటర్లలో ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. UGC-NEET- (యూజిసి-ఎన్ఇఇటి) 2026 ఆఫ్ లైన్ పరీక్ష మే-3 వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా కేంద్రంలోని 2 సెంటర్లలో 937 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రూమ్ లలో సిట్టింగ్ అలర్ట్మెంట్, మరుగుదొడ్లు, తాగునీరు, వైద్య శిబిరం, బాలికలకు సపరేట్ ఫ్రిస్కింగ్ గది, సూపర్ వైజర్ రూమ్, సిసి ఫుటేజ్, అన్ని తనికి చేశారు. అలాగే మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష కావున విద్యార్థులు మిట్ట మధ్యాహ్నం ఎండలో సెంటర్ కి వస్తారని వారికి ఏదైనా మజ్జిగ పాకెట్స్ అందించాలని సెంటర్ ఇంచార్జీకి తెలిపారు. సెంటర్ చుట్టు 144 సెక్షన్ అమలుతో గట్టి బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. యూజిసి-ఎన్ఇఇటి- 2026 పరీక్ష రాసే విద్యార్థులు ప్రశాంత వాతారణంలో పరీక్ష రాయాలని ఆల్ ద బెస్ట్ తెలిపారు.

# పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు డబ్బులు చెల్లించాలి



**రాజేంద్రనగర్ ప్రతినిధి మే 02 తెలంగాణ పత్రిక.**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నర్రగిరి లేబర్ అడ్డ దగ్గర కార్మికులతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికులకు లేబర్ మీద తాపీ మేస్త్రి , గోవా కట్టే మేస్త్రి లకు ఒక్క రోజుకు1300/- రూపాయలు, ప్లంబర్ వర్క్, పెయింటింగ్, ఎలక్ట్రిషన్ వర్క్ చేసే కార్మికులకు 1200/- రూపాయలు, పారా పని చేసే కార్మికునికి 1000/- రూపాయలు, లేబర్ అడ్డ మీద ఆడవారికి 900/- రూపాయలు అదేవిధంగా కాంక్రీట్ పనిచేసే కార్మికునికి 1050/- రూపాయలు, మట్టి పని ఒక జోడి అంటే ఇద్దరికీ 2000/- రూపాయలు లేబర్ అడ్డ మీద పనిచేసే కార్మికులకు ఇంటి యజమాని కానీ పరిశ్రమల యజమానులు కానీ ఎవరైనా పనికి తీసుకుపోయినచో ఈ విధంగా కార్మికులకు వేతనాలు ఒక రోజుకి ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. యజమానులు కార్మికులని పనులకు తీసుకుపోయే ముందు కార్మికునికి లేబర్ ఇన్సూరెన్స్ కార్డు ఉన్నదా లేదా అని కార్మికులని పనులకు తీసుకువెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల ఎఐటిసి కార్యదర్శి గిలక రాజు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ తో ఇంటిలోని సామాగ్రి దగ్ధం

**-రూ. రెండు లక్షల ఆస్తి నష్టం**
**-రోడ్డున పడ్డ సత్తయ్య-అంజమ్మ దంపతులు**



**దేవరుప్పుల, ఏప్రిల్ 2 (తెలంగాణ పత్రిక):**

మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన పోరండ్ల సత్తయ్య, అంజమ్మ దంపతుల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో శుక్రవారం దగ్ధమైంది. గ్రామ సర్పంచ్ బస్వ ఎలేంద్ర వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం సత్తయ్య అంజమ్మ దంపతులు వ్యవసాయ పనుల కోసం వెళ్లారు. ఇంట్లోని సామాగ్రి దగ్ధమవుతూ మంటలు లేస్తుండగా ఇరుగుపొరుగు వారు చూడడంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామస్తులు నీళ్లు చల్లి మంటలను ఆర్పి వేశారు. సత్తయ్య దంపతులకు సమాచారం ఇవ్వగా వ్యవసాయ బావి వద్ద నుంచి తిరిగివచ్చి చూడగా సామాగ్రి పూర్తిగా ధ్వంసం అయిపోయింది. దుస్తులు నిత్యవసర సరుకులు పూర్తియా గాలి బూడిదయ్యాయి. ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉండగా, స్థానికులు మంటలను ఆర్పి వేయడంతో అది పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రెండు లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగినట్లు సర్పంచ్ వెల్లడించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించి సత్తయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ ఎలంద్ర వెంకన్న కోరారు. అదేవిధంగా గూడు పూర్తిగా కాలిపోవడంతో నివాసం లేక సత్తయ్య కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండవ విడతలో సత్తయ్య కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు.

# 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన మాజీ కౌన్సిలర్ బి.మీనా



**మణికొండ, మే 02 తెలంగాణ పత్రిక**

2026పదో తరగతి ఫలితాల్లో పుప్పలగూడలోని త్రివేణి టాలెంట్ స్కూల్ మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మణికొండ 5వ వార్డు మాజీ కౌన్సిలర్ బి.మీనా విద్యార్థులను అభినందించారు.విద్యార్థులకు స్వీట్లు పంచి,వారి విజయాన్ని కొనియాడుతూ ఆశీర్వదించారు.మణికొండ బీ.ముత్యాలు విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ దీవెనలు అందించారు.ఈ కార్యక్రమంలో ఏసీఆర్ఓ నరేష్ మాట్లాడుతూ..మండలంలో మొదటి స్థానం సాధించడం గర్వకారణమని, పాఠశాలయాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి ఫలితమని తెలిపారు.పాఠశాల ప్రిన్సిపాల్ తిరుమల రెడ్డి విద్యార్థులను అభినందించి, భవిష్యత్ ఉన్నత విద్యలో మరింత రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఈటీ అజయ్ పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కింద సిరిసిల్లలో నియోజకవర్గ స్థాయి సభ నిర్వహణ





**-హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే**
**-ఆకట్టుకున్న వివిధ శాఖల స్టాళ్లు**
**-లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు పంపిణీ**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే02, తెలంగాణ పత్రిక**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కింద సిరిసిల్లలో నియోజకవర్గస్థాయి సభ శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ గీతం జయ జయహే తెలంగాణ వీడియోపాటను ప్రదర్శించారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పనులపై ప్రత్యేకంగా రూపొందించిన వీడియోను ప్రదర్శించారు.ఐదుగురికి నేతన్నలకు భద్రత రూ. ఐదు లక్షల చొప్పున, నేతన్నకు భరోసా కింద రూ.2 లక్షలకు పైగా విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కళ్యాణ లక్ష్మి చెక్కులు, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల బాధ్యులకు శానిటరీ నాప్కిన్స్ ఇన్సినేటర్స్, దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. మహిళా సంఘాల ఫుడ్ స్టాల్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆద్వర్యంలో ఆయిల్ పామ్ ఉత్పత్తులు, సన్న వరి సాగు, జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో సఖి కేంద్రం, పోషణ మాసం, బాలల భద్రత.. డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల స్టాళ్లను పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ**

ఇప్పటిదాకా అమలు చేసిన పథకాలు, భవిష్యత్ లో చేపట్టనున్న పనులపై ప్రణాళికలు రూపొందిస్తు న్నామని తెలిపారు. ఇప్పటికే గ్రామ, మండల సభలు నిర్వహించామని, సర్పంచులకు శిక్షణ ఇచ్చామని వెల్లడించారు.సంక్షేమ వారాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఇప్పటికే పారిశుధ్య పనులు, ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించామని, అరైవ్.. అలైవ్ కార్యక్రమాలు, రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించామని, డ్రైవర్లకు కంటి పరీక్షలు, సీపీఆర్, ప్రాథమిక చికిత్స పై అవగాహన, శిక్షణ ఇప్పించామని తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాలలో వంటగది, పారిశుధ్యం, మరమ్మత్తు పనులు చేపట్టామని, విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించాలని, స్కిల్ డెవలప్మెంట్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించామని



తెలిపారు. టీబీ ముక్త్ భారత్ కింద జిల్లాలోనిఆయా ప్రాంతాల్లో పరీక్షలు చేయిస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఇండ్లకు ప్రొసీడింగ్స్, అంగన్వాడీ కేంద్రాలకు ఆక్వాగార్డ్ నీటి శుద్ధి యంత్రాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాలు, స్కూల్ విద్యార్థులకు ఇన్సినేటర్స్ పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు తమ పరిధిలోని మోడల్ హౌస్ ను సందర్శించాలని, ప్రభుత్వ ఆర్థిక సహాయంలోనేఇండ్లు నిర్మించుకోవాలని సూచించారు. 1968 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయి.. రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మహిళా సంఘాలలోని సభ్యులకు ఇంటి నిర్మాణానికి రుణం ఇప్పిస్తామని వెల్లడించారు. రైతులు సన్న రకం వడ్లు, ఆయిల్ పామ్ సాగు చేయాలని, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సహకరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

**-డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దు**

డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు, వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించామని తెలిపారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించామని వివరించారు. రోడ్డు ప్రమాదాలు మొత్తం తగ్గించడమే లక్ష్యమని, ఇటీవల గ్రామాల్లో ఏర్పాటు అయిన రోడ్ సేఫ్టీ కమిటీలు ..బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారించాలని తెలిపారు.మైనర్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. డ్రగ్స్ రహిత జిల్లా లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. డ్రగ్ డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభించి.. బాధితులకు సేవలు అందిస్తున్నా మని పేర్కొన్నారు.

**-సిరిసిల్ల నియోజకవర్గంలో వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు..**

రైతు భరోసా పథకం ద్వారా 73,098 మంది రైతులకు రూ. 4,841.02 లక్షలు, రైతు రుణమాఫీ పథకం ద్వారా 31,359 మందికి రూ. 7,488.44 లక్షలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 2,799 మందికి రూ. 4,883.4 లక్షలు, మహాలక్ష్మీ ఉచిత బస్సు పథకం ద్వారా 6 కోట్ల 9 లక్షల మందికి రూ. 23,436 లక్షలు, మహాలక్ష్మీ రూ.500 లకు గ్యాస్ సిలిండర్ ద్వారా 50649 మందికి 157.29 లక్షలు, గృహ జ్యోతి పథకం ద్వారా 54,958 మందికి 1675.09 లక్షలు, సన్న వడ్ల సాగుకు బోనస్ కు 3,721 మందికి రూ. 427.76 లక్షలు, చేయూత పెన్షన్లు 58,406 మందికి రూ. 11188.13 లక్షలు, వృద్ధాప్య పెన్షన్లు 11396 మందికి 2613.40 లక్షలు, వితంతు పెన్షన్లు 9792 మందికి 2079.48 లక్షలు, దివ్యాంగుల పింఛన్లు 3992 మందికి రూ. 1738.73 లక్షలు, గీత కార్మికుల పెన్షన్లు 743 మందికి 226.22 లక్షలు, చేనేత కార్మికుల పెన్షన్లు 2976 మందికి 196.56 లక్షలు, బీడీ కార్మికుల పెన్షన్లు, 23286 మందికి 27803.38 లక్షలు, ఒంటరి మహిళ పెన్షన్లు 743 మందికి 162.97 లక్షలు, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ కు 2740 మందికి 508.59 లక్షలు, ఇందిరా మహిళా శక్తి 2425 మందికి 10188.87 లక్షలు, వడ్డీలేని రుణాలకు 8943 మందికి 628.13 లక్షలు 59389 మందికి ఇందిరమ్మ చీరలను, 12414 మందికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్మన్లు సబేరా బేగం, తలారి రాణి, రాములు, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రాచారి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపల్లి ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి







**-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే02, తెలంగాణ పత్రిక**

మర్రిపల్లి ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. శనివారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న మర్రిపల్లి ప్రాజెక్ట్ను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనుల్లో వేగం కూడా పెంచాలని అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్కు ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా అందుతున్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా అనుసంధాన ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం జరుగుతోందన్నారు మర్రిపల్లి ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత కుడి, ఎడమ కాల్వల ద్వారా సుమారు 3,600 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా మల్లారం, నాగయ్యపల్లి, పోచెట్టిపల్లి, కొనయపల్లి, కాశయ్యపల్లి, ఎదురు గట్ల, చెక్కపల్లి, అచ్చన్నపేట, వెంకటంపల్లి, బాలరాజపల్లి తదితర గ్రామాలకు ప్రత్యక్ష, పరోక్ష లాభాలు చేకూరుతాయని పేర్కొన్నారు .భూసేకరణకు సంబంధించిన రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం నిధులు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**-నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి**

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు విప్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఎకరానికి నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. నంది మేడారం పంపుల ద్వారా నీటి సరఫరాను మరింత మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కలికోట సూరమ్మ ప్రాజెక్ట్, లచ్చపేట రిజర్వాయర్, ఎర్రచెరువు, పటేల్ చెరువుల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేసి రైతులకు నీరు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మర్రిపల్లిలో రైతు వేదిక, గోదాముల నిర్మాణానికి భూమి కేటాయించి నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ప్రభుత్వ ధ్యేయమన్నారు. పరిశీలనలో ఆర్డీఓ రాధాభాయ్, నీటి పారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## వినియోగదారుల జేబులకు చిల్లు పెట్టబోతున్న హిందూస్థాన్ యూనీ లివర్.. పెరగనున్న ధరలు!



మే 02, తెలంగాణ పత్రిక

నిత్యం మనం వాడే సబ్బులు, షాంపూలు, డిటర్జెంట్ల ధరలు ఇకపై మరింత ప్రియం కానున్నాయి. ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ హిందూస్థాన్ యూనీలీవర్, తన ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించి వినియోగదారులకు షాక్ ఇచ్చింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు నేరుగా సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టబోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఈ పెంపునకు మూలకారణంగా కనిపిస్తున్నాయి. యుద్ధ మేఘాల వల్ల ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. దీనివల్ల రవాణా ఖర్చులు పెరగడమే కాకుండా, ప్యాకేజింగ్ కోసం వాడే ప్లాస్టిక్, సబ్బులు తదితర అన్ని వస్తువుల తయారీకి అవసరమైన ముడిసరుకుల వ్యయం 8 నుంచి 10 శాతం పెరిగింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని తట్టుకుని, కంపెనీ లాభాలను కాపాడుకోవడానికి ధరల సర్దుబాటు తప్పనిసరి అయిందని సీఈఓ ప్రియా నాయర్, సీఎఫ్ఓ నిరంజన్ గుప్తా స్పష్టం చేశారు. మనం రోజూ వాడే అనేక బ్రాండ్ల ధరలు ఇప్పటికే 2 నుంచి 5 శాతం పెరిగాయి. మరికొన్ని ఉత్పత్తుల విషయంలో ధర పెంచకుండా, ప్యాకెట్ పరిమాణాన్ని తగ్గించే వ్యూహాన్ని కూడా కంపెనీ అమలు చేస్తోంది. సాధారణంగా హిందుస్థాన్ యూనీలీవర్ వంటి పెద్ద సంస్థ ధరలు పెంచితే, దానిని అనుసరిస్తూ మిగిలిన పోటీ సంస్థలు కూడా రేట్లు పెంచే అవకాశం ఉంటుంది. ఇది మొత్తం ఎఫ్ఎంసీజీ రంగంలో ధరల పెరుగుదలకు దారితీసి, ద్రవ్యోల్బణం పెరగడానికి కారణమవుతుంది.

## విమాన సర్వీసులను నిలిపివేసిన స్పిరిట్ ఎయిర్‌లైన్స్

మే 02, తెలంగాణ పత్రిక



ఇంధన ధరల పెరుగుదలతో కష్టాల్లో కూరుకుపోయిన అమెరికా విమానయాన సంస్థ స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ ఫ్లైట్ సర్వీసులు అన్నిటినీ రద్దు చేశామని తాజాగా ప్రకటించింది. త్వరలో అన్ని కార్యకలాపాలకు ఫుల్ స్టాప్ పెడతామని శనివారం ప్రకటించింది. ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో ఉన్నామని, ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో మరో దారి లేక ఈ నిర్ణయం తీసుకున్నామని సంస్థ వెల్లడించింది. 'అన్ని స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సర్వీసులను రద్దు చేశాము. మా ప్రయాణికులు ఎయిర్‌పోర్టులకు వెళ్లవద్దని సూచిస్తున్నాము' అని ఎయిర్‌లైన్స్ మాతృసంస్థ స్పిరిట్ ఏవియేషన్ హోల్డింగ్స్ ఒక ప్రకటనలో తెలిపింది. కస్టమర్ సర్వీస్ అందుబాటులో లేదని కూడా సంస్థ వెబ్‌సైట్‌లో నోటీసు కనిపించింది. అయితే, ఇప్పటికే టికెట్లు కొన్న వారికి డబ్బుల రీఫండ్ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని కూడా సంస్థ తెలిపింది. ఇక స్పిరిట్ ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల నిలిపివేతపై కంపెనీ అధ్యక్షుడు, సీఈఓ డేవ్ డేవిస్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే కష్టాల్లో ఉన్న సంస్థ పునర్వ్యవస్థీకరణ ప్లాన్‌పై బాండ్ హోల్డర్స్‌తో మార్చి నెలలో అంగీకారం కుదిరిరిందన్నారు. అయితే, అకస్మాత్తుగా విమాన ఇంధన ధరలు పెరగడంతో పరిస్థితి చేయిదాటి పోయిందని అన్నారు. కంపెనీ కార్యకలాపాలను నిలిపివేయడం మినహా మరో దారి లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. 'వ్యాపారాన్ని కొనసాగించేందుకు వందల మిలియన్ల నిధులు కావాలి. మా వద్ద అంత డబ్బు లేదు. నిధులను సమీకరించే అవకాశం కూడా లేదు. ఇది చాలా విచారకరమైన పరిణామం' అని అన్నారు. ఇరాన్‌తో యుద్ధం మొదలయ్యాక అమెరికాలో విమాన ఇంధన ధరలు రెండింతలు అయ్యాయి. దీంతో, అనేక ఎయిర్‌లైన్స్ ఇప్పటికే ఈ ఏడాది లాభాల అంచనాలను తగ్గించుకున్నాయి. కార్యకలాపాల విస్తరణపై పెట్టుబడులకు కూడా బ్రేక్ చెప్పాయి. అప్పుల భారం, కార్యనిర్వహణ వైఫల్యాల కారణంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ 2024 నవంబర్‌లోనే దివాలా తీసినట్టు ప్రకటించింది. ఆ తరువాత పునర్వ్యవస్థీకరణ ప్లాన్‌లో భాగంగా మళ్లీ కార్యకలాపాలను ప్రారంభించింది. కంపెనీని పూర్తిగా గట్టెక్కించేందుకు మరో ప్రణాళికపై కూడా చర్చలు జరుగుతున్నాయి. సంస్థను ఆదుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం శుక్రవారం ఒక ప్లాన్‌ను ప్రతిపాదించింది. ఇదే తన చివరి ఆఫర్ అని కూడా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఈ క్రమంలోనే శనివారం స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.

## 2026-27 ఆర్థిక సంవత్సరం ఆరంభం అదిరింది..

మే 02, తెలంగాణ పత్రిక



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2026-27) ప్యాసింజర్ వాహన తయారీ సంస్థలు శుభారంభం పలికాయి. ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో ఏకంగా 4.5 లక్షల యూనిట్ల వరకు టోకు విక్రయాలు జరిగాయని అంచనా. గత ఏప్రిల్‌లో నమోదైన 3.54 లక్షల యూనిట్లతో పోలిస్తే 27 శాతం అధికమిది. మారుతి సుజుకీ, హ్యుండయ్, కియా వంటి కంపెనీలు రికార్డు విక్రయాలను జరపడం ఇందుకు దోహదపడింది. "గత సెప్టెంబరులో కార్లపై జీఎ?సటీ భారం తగ్గినప్పటి నుంచి విక్రయాలు ఊపందుకున్నాయి. ఆ జోరు ఇంకా అలాగే కొనసాగుతోంది. వాహన రుణాలపై తగ్గిన వడ్డీ రేట్లు, వ్యక్తిగత ఆదాయం పన్ను ఊరట అంశాలూ కలిసి వస్తున్నాయ"ని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు. మారుతి చిన్న కార్ల సేల్స్‌లో 74.4్న వృద్ధి: మారుతి సుజుకీ దేశీయ విక్రయాలు గత నెలలో కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 1,91,122 యూనిట్లకు పెరిగాయి. గత రికార్డు గరిష్ఠం 2025 డిసెంబరులో 1,82,165 యూనిట్లుగా నమోదయ్యాయి. గత నెల విక్రయాల వృద్ధిలో చిన్న కార్లు గణనీయ పాత్ర పోషించాయని పార్థో బెనర్జీ అన్నారు. రెండో స్థానానికి టాటా మోటార్స్: ఏప్రిల్ నెలలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్ దేశీయ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 30.5 శాతం వృద్ధితో 59,000 యూనిట్లకు చేరాయి. దీంతో మారుతి సుజుకీ తర్వాత అత్యధిక ప్యాసింజర్ వాహనాలను విక్రయించిన కంపెనీల్లో రెండో స్థానానికి ఎదిగింది. మహీంద్రా అండ్ మహీంద్రా 56,331 యూనిట్ల సేల్స్‌తో మూడో స్థానంలో ఉంది. హ్యుండయ్ మోటార్ ఇండియా 51,902 యూనిట్ల విక్రయాలతో ఆ తర్వాత స్థానానికి పరిమితమైంది. కియా ఇండియా అమ్మకాలు 16 శాతం వృద్ధితో 27,286 యూనిట్లకు పెరిగాయి.

## సూర్యవంశీని అవుట్ చేశాక జేమీసన్ 'అతి'... రాజస్థాన్ రాయల్స్ కోచ్ రియాక్షన్

మే 02, తెలంగాణ పత్రిక



ఐపీఎల్ 2026లో యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఔట్ చేసిన తర్వాత ఢిల్లీ పేసర్ కైల్ జేమీసన్ కాస్త 'అతి' చేయడంపై రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ ఆసక్తికరంగా స్పందించాడు. జేమీసన్ చర్యను విమర్శగా కాకుండా, వైభవ్‌కు దక్కిన ఒక 'కాంప్లిమెంట్'గా చూడాలని పేర్కొన్నాడు. జేమీసన్ చర్య ద్వారా వైభవ్ ఎంతటి ప్రమాదకరమైన ఆటగాడో అర్థమవుతోందని వ్యాఖ్యానించాడు. జైపూర్ వేదికగా మే 1న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే వైభవ్ సూర్యవంశీ (4) పదునైన యార్కర్‌తో కైల్ జేమీసన్ క్లీన్ బౌల్డ్ చేశాడు. అనంతరం, ఆ యువ బ్యాటర్ వైపు దూకుడుగా తిరిగి ఏదో అంటూ దూకుడుగా సంబరాలు చేసుకున్నాడు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఒక యువ ఆటగాడి పట్ల ఇలా ప్రవర్తించడం సరికాదని పలువురు అభిప్రాయపడ్డారు. అయితే, మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన విక్రమ్ రాథోడ్, ఈ వివాదానికి తనదైన శైలిలో ముగింపు పలికాడు. "సీజన్‌లో అద్భుతంగా రాణిస్తున్న మా ఓపెనర్‌ను త్వరగా ఔట్ చేశానన్న ఆనందం జేమీసన్‌లో కనిపించింది. వైభవ్‌ను ఔట్ చేసినందుకు అతను అంతగా సంతోషించాడంటే, అది వైభవ్‌కు దక్కిన ఒక ప్రశంస, కాంప్లిమెంట్" అని రాథోడ్ వివరించాడు. ప్రతి మ్యాచ్‌లోనూ వైభవ్ భారీ స్కోర్లు చేయాలని ఆశించడం సరికాదని, ఒక మంచి బంతికి ఎవరైనా ఔట్ కావొచ్చని యువ ఆటగాడికి మద్దతుగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్, ఓపెనర్లు యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ విఫలమైనప్పటికీ, 20 ఓవర్లలో 6 వికెట్లకు 225 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, డోనోవాన్ ఫెరీరా అద్భుతంగా రాణించి జట్టును ఆదుకున్నారు. అయితే, ఈ లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ కేవలం 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ ఓటమిపై రాథోడ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. మంచి స్కోరు చేసినప్పటికీ, బౌలర్లు మరోసారి తమ ప్రణాళికలను అమలు చేయడంలో విఫలమయ్యారని, ముఖ్యంగా పవర్‌ప్లేలో తేలిపోయారని విమర్శించారు. అయితే, ఓపెనర్లపైనే ఆధారపడకుండా మిడిల్ ఆర్డర్ రాణించడం సానుకూలాంశమని పేర్కొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో అభిషేక్ శర్మ పూజలు

మే 02, తెలంగాణ పత్రిక



సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ శనివారం నాడు హైదరాబాద్ నగరంలోని కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయాన్ని సందర్శించాడు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించాడు. ఆలయానికి చేరుకున్న అభిషేక్ శర్మకు అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అభిషేక్ శర్మ గర్భగుడిలో స్వామివారికి అభిషేకం జరిపించాడు. ఈ పర్యటనకు సంబంధించిన ఫోటోలను అభిషేక్ శర్మ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నాడు. "కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్" అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేయగా, ఈ ఫోటోలు కొద్ది సమయంలోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అభిమానులు, నెటిజన్లు పెద్ద సంఖ్యలో లైక్స్, కామెంట్లతో స్పందిస్తున్నారు. కాగా, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు నగరంలోని ప్రముఖ దేవాలయాలను సందర్శించడం ఇదే మొదటిసారి కాదు. గత నెలలో కూడా పలువురు ఎస్ఆర్ హెచ్ ఆటగాళ్లు బల్కంపేట ఎల్లమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి ఆలయాలను సందర్శించి పూజలు చేసిన విషయం తెలిసిందే.

# స్పోర్ట్స్

## ఆమెలో నాకు ధోనీ కనిపిస్తున్నాడు



మే 02, తెలంగాణ పత్రిక

భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మహిళల జట్టు కెప్టెన్ స్మృతి మంధనపై మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఆమె నాయకత్వ పటిమ, ప్రశాంతతను చూస్తుంటే తనకు టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గుర్తుకొస్తున్నాడని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆర్‌సీబీ విడుదల చేసిన ఓ వీడియోలో కార్తీక్ మాట్లాడుతూ.. మంధన తనకు ఇష్టమైన క్రీడాకారిణులలో ఒకరని తెలిపారు. ఆమె తనను తాను ప్రెజెంట్ చేసుకునే విధానం, నిర్ణయాల్లో స్పష్టత అద్భుతంగా ఉంటాయన్నాడు. "ఆట పరిస్థితులను అంచనా వేయడంలో ఆమెకు సహజంగానే మంచి పట్టుంది. జట్టు సభ్యులకు పూర్తి స్వేచ్ఛనిస్తుంది. అదే సమయంలో, ఎవరికైనా సందేహం వస్తే అండగా నిలుస్తుంది" అని కార్తీక్ వివరించాడు. సరిగ్గా ఇలాంటి లక్షణాలే గతంలో ధోనీలో చూశామని, అందుకే ఆమె తన నాయకత్వ పరంగా ధోనీని గుర్తుచేస్తుందని పేర్కొన్నాడు. స్మృతి మంధన కెప్టెన్సీలోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మహిళల జట్టు డబ్ల్యూపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. ఫైనల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి రెండోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా మంధన నిలిచింది. ఫైనల్‌లో డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఆర్సీబీకి విజయాన్ని అందించడంలో ఆమె కీలక పాత్ర పోషించింది. అంతేకాకుండా, గతేడాది ఐసీసీ మహిళల ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు స్మృతి వైస్-కెప్టెన్‌గా వ్యవహరించింది. ఆ టోర్నమెంట్‌లో 434 పరుగులు చేసి జట్టు తొలిసారి ప్రపంచకప్ గెలవడంలో ముఖ్య భూమిక పోషించింది.

## సినిమా టికెట్ రేట్ల పెంపు పై రవిబాబు సంచలన వ్యాఖ్యలు



మే 02, తెలంగాణ పత్రిక

సినిమా విడుదల సమయంలో టికెట్ల ధరల పెంపుపై టాలీవుడ్ వెర్సటైల్ డైరెక్టర్, నటుడు రవిబాబు తనదైన శైలిలో స్పందించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'రేజర్' చిత్రం మే 8న విడుదలకు సిద్ధమవుతున్న వేళ, సినిమా టికెట్ల ధరల పెంపుపై ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ రేట్లు పెంచడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. సినిమా ఇండస్ట్రీలో ఇప్పుడున్న ట్రెండ్ ప్రకారం... పెద్ద సినిమా వస్తోందంటే చాలు టికెట్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీనిపై రవిబాబు స్పందిస్తూ, "హీరోలను, సినిమాలను భుజాన వేసుకుని మోసేది అభిమానులే. అలాంటి వారి దగ్గర మొదటి రోజే ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పు" అని పేర్కొన్నారు. సినిమా విడుదలైన మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని ఆయన అభిప్రాయపడ్డారు. టికెట్ ధరల పెంపు వల్ల సామాన్య ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి భయపడుతున్నారని, ఈ పద్ధతి మారాలని ఆయన సూచించారు.

## జర్మనీలో మహేశ్ బాబు... బ్లాక్ ఫారెస్ట్‌లో ప్రత్యేక శిక్షణ

- ప్రస్తుతం జర్మనీలో ఉన్న సూపర్ స్టార్ మహేశ్ బాబు
- హెల్త్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ
- బ్లాక్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్, ట్రైనింగ్ అంటూ ఫొటోలు షేర్ చేసిన మహేశ్
- రాజమౌళి దర్శకత్వంలోని 'వారణాసి' చిత్రం కోసం సన్నద్ధమవుతున్నట్లు అంచనా
- 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'వారణాసి'



మే 02, తెలంగాణ పత్రిక

సూపర్ స్టార్ మహేశ్ బాబు తన ఫిట్‌నెస్‌పై ఎంత శ్రద్ధ పెడతారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 50 ఏళ్ల వయసులో కూడా ఆయన తన అథ్లెటిక్ శరీరాకృతిని కాపాడుకుంటూ యువ హీరోలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఆయన జర్మనీలో ప్రముఖ హెల్త్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ఈ విషయాన్ని మహేశ్ బాబు స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకున్నారు. జర్మనీలోని సుందరమైన బ్లాక్ ఫారెస్ట్ ప్రాంతంలో పర్యటిస్తున్నట్లు తెలిపిన మహేశ్, "ట్రెక్కింగ్... ట్రైనింగ్... రిజువనేటింగ్!!" అనే క్యాప్షన్‌తో రెండు ఫొటోలను పోస్ట్ చేశారు. ఒక ఫొటోలో పచ్చని అడవులు, జలపాతం నేపథ్యంలో డాక్టర్ హ్యారీతో కలిసి కనిపించారు. మరో ఫొటోలో జిమ్‌లో ఆయనతో పాటు ఉన్నారు. డాక్టర్ హ్యారీ కోనిగ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్, లాంగెవిటీ (ఆయుష్షు పెంపు), ప్రెసిషన్ మెడిసిన్ రంగాల్లో నిపుణుడు. మహేశ్ బాబు గత కొన్నేళ్లుగా ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. 2023 ఏప్రిల్‌లో కూడా డాక్టర్ హ్యారీ, మహేశ్‌తో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ ఆయన ఆరోగ్యం పట్ల చూపే శ్రద్ధను ప్రశంసించారు. ప్రస్తుతం మహేశ్ బాబు తీసుకుంటున్న ఈ కఠిన శిక్షణ, ఆయన లేటెస్ట్ చిత్రం కోసమేనని అభిమాన గణం, సినీ వర్గాలు భావిస్తున్నాయి. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా 'వారణాసి' అనే భారీ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 2025 నవంబర్‌లో ఈ చిత్రానికి సంబంధించిన తొలి గ్లింప్స్‌ను విడుదల చేయగా, అద్భుతమైన స్పందన వచ్చింది. క్రీ.శ. 521 నాటి వారణాసిని చూపిస్తూ ప్రారంభమైన టీజర్, చివర్లో మహేశ్ బాబు రుద్రగా త్రిశూలం చేతబట్టి ఎద్దుపై స్వారీ చేస్తున్నట్టు చూపించారు. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలతో రూపొందుతున్న 'వారణాసి' చిత్రం 2027 ఏప్రిల్ 7న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాలోని పాత్ర కోసం మహేశ్ శారీరకంగా, మానసికంగా తీవ్రంగా సన్నద్ధమవుతున్నారని, జర్మనీ పర్యటన అందులో భాగమేనని స్పష్టమవుతోంది.

## అతను 10 సార్లు లైంగికంగా వేధించాడు: కుంభమేళా ఫేమ్ మోనాలిసా సంచలన ఆరోపణలు




మే 02, తెలంగాణ పత్రిక

కుంభమేళాలో పూసలమ్ముతూ కనిపించి, తన అందంతో సోషల్ మీడియాలో ఓవర్ నైట్ సెలబ్రిటీగా మారిన మోనాలిసా జీవితం మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ప్రేమ వివాహంతో కుటుంబానికి దూరమైన ఆమె, ఇప్పుడు తనను లైంగికంగా వేధించారంటూ బాలీవుడ్ దర్శకుడితో పాటు నలుగురిపై సంచలన ఆరోపణలు చేసింది. ఈ మేరకు కేరళలోని ఎర్నాకులం సెంట్రల్ పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మోనాలిసా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టంలోని కఠినమైన సెక్షన్ల కింద నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌లో బాలీవుడ్ దర్శకుడు సనోజ్ మిశ్రా, విశ్వ హిందూ పరిషత్ (ఎవూ) నాయకుడు, న్యాయవాది అయిన అనిల్ విలయిల్ పేర్లు కూడా ఉన్నట్లు సమాచారం. 'ది డైరీ ఆఫ్ మణిపూర్' అనే సినిమా షూటింగ్ సందర్భంగా ఈ ఘటనలు జరిగాయని మోనాలిసా తన ఫిర్యాదులో పేర్కొంది. ఏప్రిల్ 29న ఈ ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పీటీఐ కథనం ద్వారా తెలిసింది.

### అసభ్యంగా తాకాడు.. కుటుంబం పట్టించుకోలేదు

కొచ్చిలో జరిగిన ఒక సమావేశంలో దర్శకుడు సనోజ్ మిశ్రా తనను చాలాసార్లు అసభ్యకరంగా తాకాడని మోనాలిసా ఆరోపించింది. "దర్శకుడు నన్ను షూటింగ్ సెట్‌లో దాదాపు 10 సార్లు లైంగికంగా వేధించాడు. అసభ్యంగా తాకాడు. ఈ విషయం గురించి మా కుటుంబ సభ్యులకు చెబితే, వారు కనీసం పట్టించుకోలేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఏప్రిల్ 30న మోనాలిసా కోర్టు ముందు హాజరై తన అధికారిక వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ఈ ఘటనలు మధ్యప్రదేశ్‌లో జరిగినందున, కేసును అక్కడి పోలీసులకు బదిలీ చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల మోనాలిసా తన కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా ఫర్మాన్ ఖాన్ అనే వ్యక్తిని వివాహం చేసుకోవడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఆమె మైనర్ అని, ఫర్మాన్ 'లవ్ జిహాద్'కు పాల్పడ్డాడని ఆమె కుటుంబం ఆరోపించింది. అయితే, మోనాలిసా మాత్రం తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ వస్తోంది. ఇప్పుడు ఈ లైంగిక వేధింపుల ఆరోపణలతో ఆమె వ్యవహారం మరింత సంక్లిష్టంగా మారింది. ఒకవైపు కుటుంబ వివాదాలు, మరోవైపు ఈ కేసులతో మోనాలిసా భవిష్యత్తు ఎలా ఉండబోతుందోనని సర్వత్రా చర్చ జరుగుతోంది.


## విజయ్ దేవరకొండను కలిసి పెళ్లి కార్డు అందించిన అభిమాని



మే 02, తెలంగాణ పత్రిక

టాలీవుడ్ యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ తన అభిమానుల పట్ల ఎంతో ప్రేమగా ఉంటారని మరోసారి రుజువైంది. అనపర్తికి చెందిన ఓ అభిమాని ఇటీవల ఆయన్ను వ్యక్తిగతంగా కలిసి తన పెళ్లి పత్రికను అందించాడు. త్వరలో జరగబోయే తన వివాహానికి తప్పకుండా హాజరు కావాలని ఆ అభిమాని మనస్ఫూర్తిగా కోరాడు. అభిమాని చూపిన ప్రేమకు విజయ్ దేవరకొండ సంతోషం వ్యక్తం చేశారు. ఆప్యాయంగా అతడిని పలకరించి, పెళ్లి పత్రికను అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన జీవితం లోకి అడుగుపెడుతున్న ఆ అభిమానికి, కాబోయే వధువుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఘటనతో విజయ్ మరోసారి తన మంచి మనసును చాటుకున్నారని ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. తనను కలవడానికి వచ్చిన అభిమానిని నిరాశపరచకుండా, విజయ్ చూపిన ఆత్మీయత అందరినీ ఆకట్టుకుంటోంది.

## ఆధ్యాత్మిక రహస్యాల చుట్టూ తిరిగే 'అగధ'



మే 02, తెలంగాణ పత్రిక

ఆధ్యాత్మిక రహస్యాలు ఎప్పుడూ ఆసక్తిని కలిగిస్తూనే ఉంటాయి .. ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తూనే ఉంటాయి. దైవిక శక్తులు .. అవి చూపించే ప్రభావం చుట్టూ ఈ తరహా కథలు నడుస్తూ ఉంటాయి. ఇలాంటి కథలు గతంలో ఎమ్మెస్ రాజు బ్యానర్లో రూపొందాయి. కథాకథనాల పరంగా అలరిస్తూ, బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాలను నమోదు చేశాయి. అలాంటి ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'అగధ'. టైటిల్ తో .. ఆ టైటిల్ ను డిజైన్ చేసిన తీరుతో అందరి దృష్టిని ఆకర్షించిన సినిమా ఇది. సీనియర్ నటి మంజుల మనవరాలు .. వనిత విజయ్ కుమార్ కూతురు 'జోవిక' ఈ సినిమాలో ప్రధానమైన పాత్రను పోషించింది. రీసెంటుగా వదిలిన ఆమె పోస్టర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఉల్కా గుప్తా .. కామాక్షి భాస్కర్ల పోస్టర్లు కూడా ఈ సినిమాపై అంచనాలు పెంచాయని చెప్పాలి. ఆదివరహా బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా, ప్రస్తుతం పోస్టు ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఆధ్యాత్మిక రహస్యాలు .. దైవిక శక్తుల చుట్టూ తిరిగే కథ ఇది. అందువలన గ్రాఫిక్స్ కి ఎక్కువ అవకాశం ఉన్న కంటెంట్ ఇది. సినిమా నిడివిలో 45 నిమిషాల పాటు గ్రాఫిక్స్ ఉంటాయని చెబుతుండటం ఆడియన్స్ లో మరింత ఉత్కంఠను పెంచుతోంది. 85 రోజుల పాటు షూటింగు జరుపుకున్న ఈ సినిమా, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా, సంచలనాన్ని సృష్టించడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది.

## ఓటీటీకి మలయాళ బ్లాక్ బస్టర్!




మే 02, తెలంగాణ పత్రిక

మలయాళంలో సంచలన విజయాన్ని సాధించిన ఒక సినిమా ఇప్పుడు ఓటీటీలో అడుగుపెట్టడానికి రెడీ అవుతోంది. ఆ సినిమా పేరే 'వాలా 2'. గతంలో వచ్చిన 'వాలా' పెద్ద హిట్. దాంతో సహజంగానే 'వాలా 2'లో అందరిలో ఆసక్తిని పెంచుతూ వచ్చింది. భారీ అంచనాల మధ్య ఏప్రిల్ 2వ తేదీన విడుదలైంది. చాలా తక్కువ బడ్జెట్ లో నిర్మితమైన ఈ సినిమా, 200 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వస్తోంది. సావిన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, హాషిర్ .. అలన్ .. అజిన్ .. వినాయక్ ప్రధానమైన పాత్రలను పోషించారు. విపిన్ దాస్ నిర్మించిన ఈ సినిమాకి, రజత్ ప్రకాశ్ సంగీతాన్ని అందించాడు. మలయాళంలో విజయవంతమైన ఈ సినిమా కోసం, ఇతర భాషా ప్రేక్షకులు అయితే వెయిట్ చేస్తున్నారు. అలాంటి ఈ సినిమా ఓటీటీ హక్కులను 'జియో హాట్ స్టార్' వారు దక్కించుకున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్టుగా అధికారికంగా ప్రకటించారు. మలయాళంతో పాటు తెలుగు .. తమిళ .. కన్నడ .. హిందీ భాషల్లో కూడా ఈ సినిమా అందుబాటులోకి వస్తోంది. ఇది నలుగురు మిడిల్ క్లాస్ కుర్రాళ్ల కథ. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి వాళ్లను చదివిస్తుంటే, వాళ్లు కాలేజ్ లో గొడవలకి దిగుతుంటారు. చివరికి కాలేజ్ లో నుంచి గెంటేసే పరిస్థితి వస్తుంది. అప్పుడు ఏం జరుగుతుంది? ఆ తరువాత ఏమౌతుంది? అనేది కథ. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమా ఏ స్థాయిలో మెప్పిస్తుందో చూడాలి.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143